సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
సంపుటి: 17 | సంచిక: 179
పేజీలు: 08 | వెల: రూ.2:00
హైదరాబాద్ | శుక్రవారం 26 జూన్ 2026
Published from Hyderabad, Vijayawada.

## దేశంలో అమెజాన్ పెట్టుబడుల వెల్లువ

### మోదీతో అమెజాన్ సీఈఓ జాస్సీ భేటీ
### యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు!



న్యూఢిల్లీ,జూన్25(సాక్ష్యం): భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది అమెరికాకు చెందిన ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్. 2026 నుంచి 2030 మధ్య కాలంలో భారత్‌లో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు గురువారం ప్రకటించింది. అలాగే 2030 నాటికి దేశంలో ఏఐ (ఆ×), క్లౌడ్ మౌలిక సదుపాయాలను విస్తరించ డానికి అదనంగా 13 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. కాగా, భారత ప్రధాని నరేంద్ర మోదీతో అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీ భేటీ

మిగతా 4 లో..



## గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

### ఎల్‌పీజీ సరఫరాపై ఆంక్షలు ఎత్తివేత

న్యూఢిల్లీ,జూన్25(సాక్ష్యం): దేశంలో వాణిజ్య, పారిశ్రామిక రంగానికి ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం ఎల్‌పీజీ (ఆా+) సరఫరాపై ఉన్న అన్ని రకాల ఆంక్షలను తక్షణమే ఎత్తివేసింది. గృహేతర ప్యాకేజ్డ్ ఎల్‌పీజీ సరఫరాపై గతంలో విధించిన రంగాల వారీ పరిమితులను పూర్తిగా తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్-అమెరికా

మిగతా 2 లో..



## పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంచిన కేంద్రం

### జూలై 1నుంచి కొత్త ఫీజులు అమలు

న్యూఢిల్లీ,జూన్25(సాక్ష్యం): కేంద్రం తాజాగా పాస్‌పోర్టు ఫీజులను పెంచింది. కొత్త ఫీజులు వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్రం ప్రకటన ప్రకారం, 18 ఏళ్లు పైబడిన వారు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) లేదా పాస్‌పోర్టు రీఇష్యూ కోసం ఇకపై రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు

మిగతా 2 లో..



## రాష్ట్రపతితో హోంమంత్రి అమిత్ షా భేటీ

### మంత్రివర్గ విస్తరణపై జోరందుకున్న ఊహాగానాలు

న్యూఢిల్లీ,జూన్25(సాక్ష్యం): రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తాజాగా భేటీ అయ్యారు. రెండు రోజుల క్రితమే ప్రధాని మోదీ రాష్ట్రపతిని కలిశారు. ఈ నేపథ్యంలో నేడు అమిత్ షా కూడా రాష్ట్రపతితో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. త్వరలోనే కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ ఖాయమన్న టాక్ ఢిల్లీ వర్గాల్లో వినిపిస్తోంది.

మిగతా 2 లో..

# ప్రకంపనల ప్రళయం



- వెనిజువెలాను వణికించిన వరుస భూకంపాలు
- సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూప్రకంపనలు
- నేలమట్టం అయిన భారీ భవనాలు, భవన సముదాయాలు
- ప్రాథమిక సమాచారం మేరకు 164 మంది మృతి
- మృతుల సంఖ్య లక్ష వరకు చేరొచ్చని అంచనా
- శతాబ్దకాలం తరవాత అతిపెద్ద భూకంపంగా నమోదు
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన అధ్యక్షురాలు రోడ్రిగేజ్
- ప్రాణనష్టం భారీగా ఉండొచ్చంటున్న జియలాజికల్ సర్వే
- ప్రజలు ఇళ్లను వదిలి బయటకు రావాలని పిలుపు
- నిర్విరామంగా కొనసాగుతున్న సహాయక చర్యలు

కారకాస్,జూన్25(సాక్ష్యం): వెనిజువెలాలో కేవలం నిమిషం తేడాలో రెండు సార్లు భారీ భూకంపం వణికించింది. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండుసార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. ఆ భూకంపాల ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది. అయితే ఆ భూకంపాల వల్ల 164మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని, వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది. మృతుల సంఖ్య లక్ష వరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. వెనెజువెలాను బుధవారం నాడు వరుస భూకంపాలు

మిగతా 2 లో..

### పంచాయితీలు కాదు..
# పరిష్కారాలు ముఖ్యం

### జల వివాదాలను పరిష్కరించుకుందాం

- తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి
- మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి
- కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి
- తుంగభద్రలో 15 టీఎంసీలకు 5 టీఎంసీలే అందుతున్నాయి
- మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



### తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు

- రూ.51 కోట్లతో 33 కొత్త గేట్ల ఏర్పాటు
- మూడు రాష్ట్రాల సీఎంలు కలిసి ప్రారంభం
- కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పాటిల్
- ఒకేవేదికపై డికె, చంద్రబాబు, రేవంత్

బళ్లారి,జూన్25(సాక్ష్యం): కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద

మిగతా 4 లో..



బళ్లారి,జూన్25(సాక్ష్యం): తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు.

మిగతా 4 లో..

# రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగులే కీలకం

- రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు బీమా భరోసా
- కోటి ప్రమాద బీమా పథకం ప్రారంభం
- అందుకే వారి సంక్షేమానికి పెద్దపీట
- రాష్ట్రాభివృద్ధి కోసం ఉద్యోగులు కష్టపడాలి
- పన్నులు ఎగవేసే వారిని పట్టుకని వసూలుచేయాలి
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- రవీంద్రభారతి వేదికగా బీమాపథకం ప్రారంభించిన సీఎం

హైదరాబాద్,జూన్25(సాక్ష్యం): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ రూ.1 కోటి ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడంలో ఉద్యోగులదే కీలకపాత్ర అని సీఎం పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, వారి కుటుంబాల

మిగతా 4 లో..



# ఉచిత ప్రమాద బీమా

- ఉద్యోగులకు 'ప్రజా ప్రభుత్వం' బంపర్ ఆఫర్
- రూ కోటి 25 లక్షల ఉచిత ప్రమాద బీమా
- విమాన ప్రమాదమైతే 3 కోట్ల వరకు రక్షణ
- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు
- దేశ చరిత్రలోనే తొలిసారి 'క్యాష్‌లెస్' హెల్త్ కార్డ్స్
- ఒకటో తేదీనే జీతాలు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,జూన్25(సాక్ష్యం): తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వం లోని క్యాబినెట్ ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే

మిగతా 2 లో..



## ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు అంకురార్పణ

### ఈ ఏడాది 'పంచముఖ సంకటహర మహాగణపతి'

### నిర్జల ఏకాదశి పర్వదినంతో కర్రపూజ నిర్వహించిన ఉత్సవ కమిటీ

హైదరాబాద్,జూన్25(సాక్ష్యం): ఖైరతాబాద్ బడా గణేశుడి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయి. హైదరాబాద్ నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ, శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గురువారం సాంప్రదాయబద్ధంగా కర్ర పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 69 అడుగుల భారీ విగ్రహం నమూనా పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ఆవిష్కరించింది.

మిగతా 2 లో..

## ప్రజాప్రభుత్వంలో రైతుభరోసాకు పెద్దపీట

- రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశాం
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. అప్పులు చేసి ఇస్తున్నాం
- పదివేల కోట్లు నష్టం వచ్చినా పంటలు కొనుగోలు
- సీఎం సభావేదికను పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం,జూన్25(సాక్ష్యం): ప్రజాప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం రైతు భరోసా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి పంటను



మిగతా 2 లో..

## ఫీజు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదు

- బకాయిలపై ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న
- ప్రైవేట్ యాజమాన్యాలకు స్వల్ప ఊరట



హైదరాబాద్,జూన్25(సాక్ష్యం): తెలంగాణ హైకోర్టు లో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన

మిగతా 4 లో..

సాక్ష్యం



# సంపాదకీయం

## ఇరాన్‌తో ఆయిల్ డీల్‌కు మళ్లీ అవకాశం !

ప్రపంచం బాగుండాలంటే ముందు ట్రంప్ దూకుడుకు అక్కడి పార్లమెంట్ కళ్లెం వేయాలి. ఇరాన్‌పై ఇంకా ఆంక్షలు విధించడం, బెదిరించడం వంటివి చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఒక్క ట్రంప్ కారణంగా ప్రపంచం యావత్తూ అతాలకుతలం అయ్యింది. సునీమా వచ్చినంత పనయ్యింది. మళ్లీ కోలుకోవడమెలా అన్న సందిగ్ధంలో ప్రపంచ దేశాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక స్థితి దిగజారింది. ముఖ్యంగా భారత్ లాంటి అనేక దేవాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను తన మానా తను బతికేలా చూడాలి. ట్రంప్ ఇక తన దేశ పురోగతికి సమయం కేటాయిస్తే చాలు. హర్మూజ్ తెరుచుకోవడం, చమురు ధరలు దిగిరావడం అన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా భారత్‌కు పెద్ద ఊరట అని చెప్పాలి. అలాగే భారత్ ఎవరి వద్ద చమురు కొనాలో వద్దో అన్నది అమెరికాకు సంబంధించిన వ్యవహారం కాదు. భారత్ ఎవరితో వాణిజ్యం చేయాలో చేస్తుంది. ఎవరితో చమురు డీల్ చేసుకోవాలో చేసుకుంటుంది. అంతేగానీ వేలుపెట్టాలని ఇక ట్రంప్ చేడడం మానుకోవాలి. ట్రంప్ తీరువల్ల అమెరికా ఇప్పటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. అక్కడా చమురు ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అక్కడున్న వారిని వెళ్లగొట్టే ప్రయత్నంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రణసంకటంగా మారాయి. ముఖ్యంగా భారతీయ టెక్కీలకు ఇదొక సమస్యగా మారింది. ఇకపోతే చమురు ధరలు దిగిరావడం, మళ్లీ హర్మోజ్ తెరుచుకోవడం తో ఇక స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం వచ్చింది. దీనిపై అటు ట్రంప్ కానీ, ఇటు ఇరాన్ కానీ పేచీలు లేకుండా చూసుకోవాలి. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి. అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో భారత్–ఇరాన్ మధ్య ఇంధన రంగంలో మళ్లీ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్‌నెజాద్ ఈ వారం భారత పెట్రోలియం మరియు సహజ వాయు మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్న నేపథ్యంలో, భారత్‌కు ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరాల భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో పరిమిత స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా ఆంక్షలకు ముందు భారత్‌కు ప్రధాన ముడి చమురు సరఫరాదారుల్లో ఇరాన్ ఒకటి. ముఖ్యంగా తక్కువ ధరలు, అనుకూల క్రెడిట్ సౌకర్యాలు, భారత రిఫైనరీలకు అనువైన నాణ్యత కారణంగా ఇరాన్ చమురుకు మంచి డిమాండ్ ఉండేది. భారత్–ఇరాన్ మధ్య జరగనున్న తాజా చర్చలు ఇంధన రంగంలో కొత్త అవకాశాలకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు పునరుద్ధరించబడేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, భవిష్యత్ కొనుగోళ్లు వాణిజ్య ప్రయోజనాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు మరియు ఆంక్షల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. 2015లో భారత్ సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో 6 శాతం వాటాను కలిగి ఉంది. 2016లో ఈ దిగుమతులు 14 ఎంఎంటీలకు చేరి వాటా 6.7 శాతానికి పెరిగింది. అయితే, 2017లో ఇరాన్ నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ఆ ఏడాది భారత్ 27 ఎంఎంటీల చమురును కొనుగోలు చేయగా, దేశ మొత్తం చమురు అవసరాల్లో ఇరాన్ వాటా 12.6 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట స్థాయి. 2018లో దిగుమతులు 23 ఎంఎంటీలకు తగ్గినా, ఇరాన్ వాటా 10.4 శాతంగా కొనసాగింది. 2019లో 24 ఎంఎంటీల దిగుమతులతో ఇరాన్ వాటా 10.6 శాతంగా నమోదైంది. అయితే 2019 మేలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసి, చమురు కొనుగోలు చేసే దేశాలకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపి వేయాల్సి వచ్చింది. ఈ ప్రభావం 2020లో స్పష్టంగా కనిపించింది. ఆ ఏడాది భారత్ కేవలం 2 ఎంఎంటీల చమురును మాత్రమే ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. దీంతో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 1 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఇటీవల నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్ఐఓసీ) భారత రిఫైనరీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి భవిష్యత్ చమురు సరఫరాలపై చర్చలు ప్రారంభించి నట్లు సమాచారం. అయితే భారత రి÷నైరీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలపై స్పష్టత, చెల్లింపు విధానాలు, షిప్పింగ్ మరియు బీమా సౌకర్యాలపై భరోసా లభించిన తర్వాతే పెద్ద ఎత్తున కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కెప్లర్ డేటా ప్రకారం, జూన్ నెలలో భారత్ రోజుకు సుమారు 73 వేల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఏప్రిల్‌లో పరిమిత స్థాయిలో పునఃప్రారంభమైన సరఫరాలు క్రమంగా పెరుగుతున్నట్లు ఇది సూచిస్తోంది.

## ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు అంకురార్పణ

మొదటిపేజీ తరువాయి..

ఈ ఏడాది 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా ఖైరతాబాద్ గణేశుడు దర్శనమివ్వనున్నాడు. విగ్రహానికి ఓ వైపు సోమనాథ్ జ్యోతిర్లింగం, మరోవైపు కాళీమాత విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి పండుగ జరగనుంది. ఈ ఏడాదితో ఖైరతాబాద్‌లో బడా గణేశుడి ఉత్సవాలు ప్రారంభమై 72 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈ పూజా కార్యక్రమం అనంతరం స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ ఏడాది కొలువుదీరనున్న వినాయకుడి నమూనా పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు. రాబోయే వినాయక చవితి పండుగ నాటికి, అంటే కేవలం 82 రోజుల్లోనే అన్ని హంగులతో కూడిన 70 అడుగుల భారీ మహా గణపతి విగ్రహాన్ని పూర్తి చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలు సమసిపోయి, శాంతి చేకూరాలనే సంకల్పంతో ఈ సారి ఖైరతాబాద్ గణేశుడిని 'పంచముఖ సంకట హార మహా గణపతి' రూపంలో ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ భారీ విగ్రహానికి కుడి వైపున ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం రూపాన్ని, ఎడమ వైపున భక్తులను రక్షించే కాళికామాత విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. లోకకల్యాణార్థం కొలువుదీరనున్న ఈ పంచముఖ గణపతి విశేష రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది.

## ఎక్సైజ్ శాఖలో డిప్యూటీ కమిషనర్ల బదిలీ

### గ్రేటర్ హైదరాబాద్ డీసీగా శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్,జూన్25(సాక్ష్యం):
రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎక్సైజ్ శాఖలో డిప్యూటీ కమిషనర్లుగా పనిచేస్తున్న అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మరికొందరికి కొత్తగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు.

మెదక్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న జె హరికిషన్‌ను సైబరాబాద్ డీసీగా, నల్గొండలో డీసీగా పనిచేస్తున్న ఏ శ్రీనివాస్‌రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ డీసీగా బదిలీ చేశారు. రంగారెడ్డి డీసీగా ఉన్న దశరథను టీజీబీసీఎల్ డీసీగా, ఖమ్మంలో డీసీగా ఉన్న జనార్దన్ రెడ్డి ఆదిలాబాద్ డీసీగా బదిలీ చేశారు. టీజీబీసీఎల్ ఆర్ఆర్–1లో ఉన్న దాతురాజు గౌడ్‌ను వరంగల్ డీసీగా, నిజామాబాద్‌లో ఏసీగా ఉన్న వి.సోమిరెడ్డిని ఖమ్మం డీసీగా, కరీంనగర్ బీసీఎల్‌లో మేనేజర్‌గా ఉన్న రవీకుమార్‌ను కరీంనగర్ డీసీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీ లేబుల్స్‌లో పనిచేస్తున్న పి శ్రీధర్‌ను నిజామాబాద్ డీసీగా, హెడ్‌క్వార్టర్స్‌లో డీసీగా ఉన్న కె రఘురాంను రంగారెడ్డి డీసీగా, హైదరాబాద్ ఏసీగా ఉన్న ఏ అనిల్ కుమార్ రెడ్డిని ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. స్పెషల్ టాస్క్ ఫోర్స్‌లో ఏసీగా ఉన్న పి ప్రణవిని మల్కాజిగిరి డీసీగా, మహబూబ్ నగర్ ఏసీ విజయ్ భాస్కర్ రెడ్డి డీసీ అక్కడే పదోన్నతి కల్పించింది. బ్రేవరీస్‌లో ఏసీగా ఉన్న చంద్రయ్యను మెదక్ డీసీగా, ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న సీవీ శశిధర్ రెడ్డిని నల్గొండ డీసీగా బదిలీ చేసింది. బదిలీ అయిన అధికారులు తక్షణమే విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది .

# ప్రకంపనల ప్రళయం

మొదటిపేజీ తరువాయి..

39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూకంపాలు సంభవించి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కరేబియన్ తీరంలోని మోరోన్ పట్టణానికి పశ్చిమాన 21 కిలోమీటర్ల దూరంలో 7.2 తీవ్రతతో మొదటి భూకంపం వచ్చింది. అదే పట్టణానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో క్షణాల



వ్యవధిలోనే 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 10 వేల నుంచి లక్ష మంది వరకూ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. అలాగే వేల మంది ప్రజలు గాయపడి ఉండొచ్చని తెలిపింది. భూకంపాలతో అనేక భవనాలు నేలమట్టం కాగా, ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న అనేక వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. మొదటి భూకంపం వచ్చినప్పుడు ఒక్కసారిగా పెద్దపెద్ద భవనాలు కూలిపోవడం ప్రారంభమయ్యాయి. అనేక చిన్నచిన్న ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఏం జరుగుతుందో గ్రహించి, ప్రాణరక్షణ కోసం ప్రజలు పరిగెత్తే లోపే అంతకంటే ఎక్కువ తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దీంతో భారీ విధ్వంసం జరిగింది. కొన్ని భారీ భవనాలు కూలిపోగా, మరికొన్ని బిల్డింగులు ఊగిపోయాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు కూలిపోగా, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో తమ ప్రాణాలను, కుటుంబ సభ్యులను కాపాడు కునేందుకు స్థానికులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మరోవైపు వెనెజువెలాలోని సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు కూలిపోయింది. దీంతో విమానాశ్రయంలోని టెర్మినల్ మొత్తం దుమ్ముతో నిండిపోయింది. కొంతమంది ప్రయాణికులు తమ లగేజీ పట్టుకుని ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. మరికొంతమంది లోపలే ఓ ఫుడ్ కౌంటర్ వద్ద ఆశ్రయం పొందారు. మొత్తం దుమ్ముతో నిండిపోతున్నా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అక్కడే ఉండిపోయారు. తీరప్రాంత నగరమైన లా గువైరాకు సంబంధించిన మరో వీడియో వెలుగులోకి వచ్చింది. వరుస భూకంపాలతో కూలిపోయిన భవనాలు, గాలిలోని దుమ్ము, నిర్మానుష్యంగా మారిన రహదారులు ఆ వీడియోలో కనిపించాయి.

వెనెజువెలా రాజధాని కారకాస్‌లోనూ భారీ విధ్వంసం జరిగింది. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. స్థానికులు ప్రాణభయంతో కేకలు వేసిన దృశ్యాలు ఆవేదన కలిగిస్తున్నాయి. మరో వీడియోలో ఓ వ్యక్తి తన పెంపుడు కుక్కల ప్రాణాలు కాపాడిన దృశ్యాలు కనిపించాయి. కూలిపోయిన తమ ఇంటి నుంచి అతి కష్టం మీద కుటుంబ సభ్యులను కాపాడుకున్నాడు బాధితుడు. ఆ తర్వాత తన రెండు కుక్కలనూ ప్రాణాలతో బయటకు తీసుకువచ్చాడు. ఇలాంటి అనేక వీడియోలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కంటతడి పెట్టిస్తున్నాయి. మరోవైపు జంట భూకంపాల అనంతరం వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో కూడా ప్రజలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ప్రకృతి విపత్తు తీవ్రత ధాటికి దేశ రాజధానిలో తీవ్ర నష్టం వాటిల్లింది. పలు బహుళ అంతస్తు భవనాలు కూలిపోయాయి. శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయి ఉండొచ్చని, దాంతో భారీ సంఖ్యలో ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ భూకంపాల తర్వాత బలమైన ప్రకంపనలు రావొచ్చు. దాంతో ఈ విపత్తు విధ్వంసకరంగా ఉండొచ్చు. భారీగా ప్రాణ, ఆస్తినష్టం సంభవించే అవకాశం ఉంది. మృతుల సంఖ్య 10వేల నుంచి లక్ష వరకు ఉండవచ్చని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. ప్రస్తుతానికి వెనెజువెలా ప్రభుత్వం మృతుల సంఖ్యపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. భూకంపాల ధాటికి గాయపడిన వారి సంఖ్య పెరుగుతూనే ఉందని స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. ఇళ్లను వదిలి బయటకు వచ్చేయాలంటూ భూకంపాల ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వెనెజువెలా ప్రభుత్వం సూచించింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఇళ్లకున్న పెట్రోల్ సరఫరాను కట్ చేసినట్లు వెల్లడించింది. కొన్ని భవనాలు కూలిపోయాయని, మరింత నష్టం వాటిల్లకుండా ఈ చర్యలని పేర్కొంది. జూన్ 24.. వెనెజువెలాలో నేషనల్ హాలిడే. దాంతో మిగతా రోజులతో పోలిస్తే.. ఎక్కువమంది ఇళ్లలోనే ఉన్నారు. బుధవారం సాయంత్రం ఆరుగంటల సమయంలో తొలి భూకంపం వచ్చింది. దాంతో భూమి కంపించినప్పుడు భారీగా ప్రజలు బయటకు పరిగెత్తిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాణనష్ట తీవ్రత పెరగడానికి ఈ హాలిడే కూడా ఒక బలమైన కారణం కావొచ్చని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తులో భారీగా మరణాల సంఖ్య ఉండొచ్చని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ కూడా తన సందేశంలో పేర్కొన్నారు. రెండు భారీ భూకంపాల తర్వాత 20 వరకు ప్రకంపనలు వచ్చాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో వెనెజువెలాలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భూకంపం ధాటికి మెక్విషియా అంతర్జాతీయ విమానాశ్రయం దెబ్బతిన్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దాంతో దానిని మూసివేశారు. పలు విమానాల రాకపోకలను నిలిపివేశారు. రాజధానితో పాటు భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలు మూసివేశారు.

## ప్రజాప్రభుత్వంలో రైతుభరోసాకు పెద్దపీట

మొదటిపేజీ తరువాయి..

కొనుగోలు చేశామని అన్నారు. ఏడాదికి పది వేల కోట్లు నష్టం వచ్చినప్పటికీ కొనుగోలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ కలిపి రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారన్నారు. ఈ సభకు రైతు ఆశీర్వాద సభగా రైతులే నామకరణం చేశారని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం కష్టంలో ఉందని, నిధుల కొరత ఉందని అయినా రైతాంగానికి అండగా ఉండాలని అప్పుచేసి మరీ రైతుభరోసా ఇస్తున్నామని చెప్పారు. ఈనెల 28న రైతు ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. 28, 29 రెండు రోజుల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సభా ప్రాంగణంలో అందుబాటులో ఉంటారన్నారు. 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. భారత దేశంలో అత్యధికంగా పంటలు పండించిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. వ్యవసాయ రంగంలో పంటమార్పిడి విధానంలో ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పది వేల ఎకరాలను రైతులు సాగు చేసే విధంగా సహకారం అందజేస్తున్నామని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే అత్యధిక ఆయిల్ ఫాం సాగు జరుగుతోందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. ఏడు రకాల వరి అందుబాటులో ఉందని రైతాంగానికి తుమ్మల తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా ఉంచుతున్నారని... నిల్వ చేసి అధిక ధరలకు అమ్మేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ కూడా భయపడవద్దని.. అందరికీ యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని.. అందులో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. యూరియా కోసం తెచ్చిన యాప్ దేశానికే ఆదర్శమని ప్రధాని మోదీ కూడా ప్రశంసించే పరిస్థితి ఉందన్నారు. రైతాంగం పాడి పంటపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. అత్యధికంగా పురుగుల మందులు వాడుతున్నారని ఇక్కడి పంటలను విదేశాలు రిజెక్ట్ చేస్తున్నాయన్నారు.

## ఉచిత ప్రమాద బీమా

మొదటిపేజీ తరువాయి..

ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా, బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ అద్భుతమైన బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ. 2



కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని భట్టి విక్రమార్క వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఉద్యోగులకు రూ. 10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఉద్యోగులకు ఆర్థిక అండ లభిస్తుందన్నారు. కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే కాకుండా.. నెలనెలా ప్రభుత్వ రికార్డుల ద్వారా జీతం పొందే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. తమ కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా ఆపద వస్తే ఆ కుటుంబం రాత్రికి రాత్రే రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదు. ఉద్యోగులు కేవలం జీతగాళ్లు కాదు, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఒక పెద్ద దిక్కుగా ఉంటుందని నమ్మకం కలిగించడమే మా లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో ఇళ్లు, వాహనాలు, పిల్లల చదువుల కోసం ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఇన్‌స్టాల్మెంట్స్ (ఈఎంఐలు) కడుతున్నారు. సకాలంలో జీతాలు రాకపోతే వారి అకౌంట్లు బ్యాడ్ అకౌంట్స్‌గా మారి సిబిల్ స్కోర్ దెబ్బతినేది. మా ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి గారు 'ఉద్యోగుల హక్కులను కాపాడాలి' అని గట్టిగా నిర్ణయించుకుని, ఒకటో తేదీ నాడే జీతాలు ఇచ్చేలా కఠినమైన ప్రణాళికను అమలు చేశారని అన్నారు. ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్న హెల్త్ కార్డుల సమస్యకు ప్రజా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక ప్రత్యేక 'ట్రస్ట్' ద్వారా ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో 'క్యాష్‌లెస్' (నగదు రహిత) వైద్య సేవలు అందించేలా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, దీనివల్ల ఆరోగ్య భద్రత మరింత మెరుగవుతుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10 లక్షల ఉచిత వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రేషన్ కార్డులపై సన్నబియ్యం, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ ద్వారా రూ. 1,11,116 ఆర్థిక సాయం వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ సంక్షేమ ఫలాలను చిట్టచివరి లబ్దిదారునికి చేర్చడంలో డెలివరీ మెకానిజంగా ఉద్యోగులే కీలక పాత్ర పోషిస్తున్నారని, అందుకే వారి కుటుంబ సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం తన బాధ్యతగా తీసుకుందని కొనియాడారు. ఈ బీమా పథకం నమోదుకు ముందుకు వచ్చిన బ్యాంకర్లకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సుదూర విజన్‌కు అనుగుణంగా, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ఉద్యోగులు, బ్యాంకర్లు, ప్రభుత్వం సమష్టిగా, చేయి చేయి కలిపి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఎ రేవంత్ రెడ ÷–డి, మంత్రులు పొన్నంప్రభాకర్, పొంగులేటి, అజారుద్దీన్, వివేక, సిఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

మొదటిపేజీ తరువాయి..

ఉద్రిక్తతల తర్వాత తలెత్తిన అంతర్జాతీయ సంక్షోభానికి ముందు ఎలాంటి పరిస్థితులు ఉండేవో.. ఇప్పుడు ఎల్‌పీజీ సరఫరా మళ్లీ అదే యథాస్థితికి చేరుకుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వం ఆంక్షలను సడలించడంతో సంక్షోభం ప్రారంభంలో నిలిచిపోయిన బల్క్ ఎల్‌పీజీ సరఫరాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా పునఃప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వీటిని సంక్షోభానికి ముందున్న వినియోగంలో 50 శాతానికి పునరుద్ధరించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల హోటళ్లు, పరిశ్రమలు, భారీ వాణిజ్య సంస్థలకు ఇంధన లభ్యత పెరిగి భారీ ఉపశమనం కలగనుంది. అంతర్జాతీయ సంక్షోభ సమయంలో దేశీయంగా ఎల్‌పీజీ కొరత రాకుండా చూసేందుకు చర్యలు చేపట్టింది. ఉత్పత్తిని పెంచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం గతంలో నిత్యావసర వస్తువుల చట్టం కింద ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఆదేశాల ప్రకారం.. రిఫైనరీల నుండి వచ్చే జ3–జ4 (ప్రొపేన్ -- బ్యూటేన్) స్ట్రీమ్‌లను కేవలం ఎల్‌పీజీ ఉత్పత్తికి మాత్రమే ఉపయోగించాలనే నిబంధన విధించింది. దీనికోసం పెట్రోకెమికల్ మరియు ఇతర అనువర్తనాల నుండి ఆ స్ట్రీమ్‌లను పూర్తిగా ఎల్‌పీజీ వైపు మళ్లించారు. ప్రస్తుతం దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తి గణనీయంగా మెరుగుపడటంతో పాటు, విదేశాల నుండి దిగుమతి చేసుకున్న ఎల్‌పీజీ కార్గోలు కూడా దేశానికి చేరుకుంటున్నాయి. ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో, ఎల్‌పీజీ పూల్‌లో జ3–జ4 స్ట్రీమ్‌ల వినియోగాన్ని తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల ఇకపై ఆ స్ట్రీమ్‌లను యథావిధిగా పెట్రోకెమికల్స్ మరియు ఇతర కీలక పారిశ్రామిక రంగాల అవసరాలకు ఎక్కువగా కేటాయించనున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ తాజా నిర్ణయం పూర్తిగా వాణిజ్య, పారిశ్రామిక ఎల్‌పీజీ, పెట్రోకెమికల్ రంగానికి మాత్రమే వర్తిస్తుంది. దీనివల్ల సామాన్య ప్రజలు ఇళ్లలో ఉపయోగించే గృహ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని, అలాగే వాటి ధరలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడబోదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి.

## పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంచిన కేంద్రం

మొదటిపేజీ తరువాయి..

రూ.1,500గా ఉండేది. ఇక తత్కాల్ పథకం కింద ఇదే పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారి ఫీజు రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెరిగింది. 60 పేజీల పాస్‌పోర్టు ఫీజు కూడా రూ.2 వేల నుంచి రూ.3,500కు పెరిగింది. తత్కాల్ పథకం కింద ఈ పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారు ఇకపై రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు రూ.4 వేలుగా ఉండేది. పాస్‌పోర్టు పోగొట్టుకున్న సందర్భాల్లో కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) కోసం ఇకపై రూ.5 వేలు చెల్లించాలి. తత్కాల్ స్కీమ్‌లో బుక్ చేసుకుంటే రూ.7,500 చెల్లించాల్సి ఉంటుంది. 60 పేజీల పాస్‌పోర్టు విషయంలో ఈ ఫీజులు వరుసగా రూ.6 వేలు, రూ.8,500 వేలకు పెరిగాయి. 18 ఏళ్ల పిల్లలకు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) ఫీజు రూ.1,750గా నిర్ణయించింది. తత్కాల్ పథకం కింద ఈ పాస్‌పోర్టు కోసం ఇకపై రూ.4,250 చెల్లించాల్సి ఉంటుంది. మైనర్లు పాస్‌పోర్టు పోగొట్టుకున్న సందర్భాల్లో కొత్త పాస్‌పోర్టు కోసం రూ.4,250, తత్కాల్ స్కీమ్ కింద ఇదే పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకుంటే రూ.6,750 చెల్లించాల్సి ఉంటుంది. మేరకు విదేశాంగ శాఖ పాస్‌పోర్టు నిబంధనలకు మార్పులు చేసింది. 2012లో చివరిసారిగా కేంద్రం పాస్‌పోర్టు ఫీజులను సవరించింది. సాధారణ విధానంలో దరఖాస్తు చేసుకుంటే 45 రోజుల్లోపు పాస్‌పోర్టు జారీ అవుతుందన్న విషయం తెలిసిందే. తత్కాల్ విధానంలో ఇంతకంటే త్వరగా పాస్‌పోర్టు పొందే అవకాశం ఉంది.

## రాష్ట్రపతితో హోంమంత్రి అమిత్ షా భేటీ

మొదటిపేజీ తరువాయి..

జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టుల రాజ్యసభ పదవీకాలం ముగియడంతో కేంద్ర కేబినెట్‌లో ఖాళీలు ఏర్పడ్డాయి. మరోవైపు, కేంద్ర మంత్రులుగా ఉన్న కొందరు సీనియర్ నేతలకు రాష్ట్రాల పార్టీ అధ్యక్ష బాధ్యతలను బీజేపీ అప్పగించింది. ఈ నేపథ్యంలో వీరు త్వరలోనే మంత్రి పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక రాబోయే పంజాబ్, ఉత్తరప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, సామాజిక సమీకరణల ఆధారంగా కొత్త వారికి కేబినెట్‌లో చోటుదక్కే అవకాశం ఉంది. శివసేన (షిండే వర్గం), జేడీయూ వంటి కూటమి పక్షాల నుంచి అదనపు మంత్రి పదవుల కోసం కేంద్రంపై ఒత్తిడి పెరుగుతోందని సమాచారం. ఈ నేపథ్యంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల లోపే కేబినెట్ విస్తరణ ప్రక్రియను పూర్తి చేసేలా మోదీ–షా ద్వయం కసరత్తు చేస్తునట్టు సమాచారం.
జులై 20 వ తేదీ తరువాత పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరిగే అవకాశం ఉంది.



సాక్ష్యం

రాష్ట్రీయం STATE

హైదరాబాద్
శుక్రవారం 26 జూన్ 2026



## కర్నాటక ప్రాజెక్టులతో మరణశాసనమే

### పాలమూరుకు చుక్కనీరు కూడా రాదు
### మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ ఆందోళన

మహబూబ్‌నగర్,జూన్25(సాక్ష్యం): కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు మరణ శాసనం కానుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆర్డీఎస్‌పై కృష్ణ పరివాహక ప్రాంతంలో ఆయా ప్రాంత రైతులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తాము



మాట్లాడుతున్నది అవాస్తవం కాదని అన్నారు.
తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల ఎత్తివేతకు హెలికాప్టర్‌లో వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అక్రమా ప్రాజెక్టులు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఆర్డీఎస్‌కు వంద మీటర్ల దూరంలోనే కర్ణాటక ప్రభుత్వం లిఫ్ట్ పనులు మొదలు పెట్టిందని, వీటితోపాటు మరో రెండు రోడ్ కమ్ బ్యారేజులు కడుతుందని ఆరోపించారు. చంద్రబాబు గుండ్రేవుల వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్‌కు ప్రణాళిక తయారు చేశారని వెల్లడించారు. వీటి వల్ల తుంగభద్ర నీరు శ్రీశైలంకు శాశ్వతంగా రావని వివరించారు. కృష్ణా పైకూడా అనేక ప్రాజెక్టులు కడుతున్నారని, ఇవన్నీ ఎలాంటి అనుమతులు లేకుండానే జరుగుతున్నాయని వెల్లడించారు. అక్రమ నిర్మాణాలు పూర్తయితే పాలమూరు లో ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఒక్క చుక్క నీరు రాదని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అయినా అక్రమ ప్రాజెక్టుల వద్దకు వెళ్లి చూడాలని కోరారు. జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా వ్యతిరేకించారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే కర్ణాటక, ఏపీ ప్రభుత్వాలు అక్రమంగా చేపట్టిన ప్రాజెక్టు పనులు నిలిపివేస్తామని అన్నారు.

## 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం

### ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

హైదరాబాద్,జూన్25(సాక్ష్యం): తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం



చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. భద్రాచలం ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించారని ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఆలయ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశిరచిన గడువులోనే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆలయ పునరుద్ధరణ పనులకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 351 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి నిర్దేశిరచిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి ముందస్తుగానే పనుల విభజన చేసుకొని సమతరంగా అన్ని పనులు చేపట్టాలని సూచించారు.

## వ్యాక్సిన్లపై క్యూఆర్ కోడ్ తప్పనిసరి!

### కేంద్ర సర్కార్ సంచలన నిర్ణయం..

న్యూఢిల్లీ,జూన్25(సాక్ష్యం): భారతదేశ ఫార్మాస్యూటికల్ సరఫరా, నాణ్యత, భద్రత, సమగ్రతను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో నకిలీ, నాసిరకం



మందుల చలామణీకి అడ్డుకట్ట వేసేందుకు వీలుగా.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 'డ్రగ్స్ రూల్స్, 1945'కు కీలక సవరణలను నోటిఫై చేసింది. ఈ సరికొత్త సవరణల ద్వారా 'షెడ్యూల్ ఎ2' పరిధిని విస్తరించడంతో పాటు, అత్యంత కీలకమైన అదనపు కేటగిరీల మందులను కూడా క్యూఆర్ కోడ్ ఆధారిత 'ట్రాక్ అండ్ ట్రేస్' ఫ్రేమ్‌వర్క్ పరిధిలోకి తీసుకువచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం.. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టెన్సెస్ చట్టం-1985 పరిధిలోకి వచ్చే అన్ని రకాల వ్యాక్సిన్‌లు, యాంటీమైక్రోబియల్స్ (యాంటీబయాటిక్స్), నార్కోటిక్, సైకోట్రోపిక్ డ్రగ్స్, అలాగే అన్ని రకాల క్యాన్సర్ నిరోధక ఔషధాలను 'షెడ్యూల్ ఎ2' కింద చేర్చారు. సవరణ ఫలితంగా, సదరు ఔషధాల తయారీదారులు తాము ఉత్పత్తి చేసే మందుల ప్రాథమిక ప్యాకేజింగ్ లేబుల్‌పై (ఉదాహరణకు బాటిల్ లేదా స్ట్రిప్), ఒకవేళ అక్కడ తగినంత స్థలం లేకపోతే ద్వితీయ ప్యాకేజింగ్ లేబుల్‌పై తప్పనిసరిగా బార్ కోడ్ లేదా క్విక్ రెస్పాన్స్ కోడ్‌ను ముద్రించాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా ఔషధాల తయారీ నుండి రోగికి చేరే వరకు ప్రతి దశను డిజిటల్‌గా పర్యవేక్షించవచ్చు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ల ద్వారా స్కాన్ చేసినప్పుడు ఈ క్యూఆర్ కోడ్‌లో క్రింది కీలక సమాచారం లభిస్తుంది.

పంచాయితీలు కాదు..

# పరిష్కారాలు ముఖ్యం

మొదటిపేజీ తరువాయి..

రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.




గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగులే కీలకం



మొదటిపేజీ తరువాయి..

సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో బీమా పథకాన్ని గురువారం సాయంత్రం సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, ప్రమాద బీమా పథకాన్ని తొలిసారిగా సింగరేణిలో ప్రారంభించామన్నారు. 45 మంది కార్మికుల కుటుంబాలకు బీమా సాయం అందించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తాను కూడా మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినేనని, ఉద్యోగుల సమస్యలు, వారి అవసరాలు తనకు బాగా తెలుసని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అందరికీ భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.తాను దొరను కాదని, ప్రజల మధ్య నుంచి ఎదిగిన వ్యక్తినని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. మంత్రివర్గానికీ తానే మేస్త్రీ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరు అవహేళన చేసినా పట్టించుకోనని, రేవంతన్నగా పిలిపించుకోవడమే తనకు ఇష్టమని చెప్పారు. పదవులు, హోదాలు మారొచ్చుగానీ ప్రజలతో తన అనుబంధం ఎప్పటికీ మారదని స్పష్టం చేశారు. అలాగే గత పాలనలో ఉద్యోగులకు ప్రతి నెల 10వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని విమర్శించారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1 నుంచి ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులు ప్రమాదంలో చనిపోతే కోటిన్నర బీమా ఇస్తామని ప్రకటించిన సీఎం.. ఆదిశగా ముందడుగు వేశారు. బ్యాంకులను ఒప్పించి బీమా ఎంఓయూపై సంతకం చేశారు.ఈ బీమాతో 15 లక్షల మంది రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు లబ్ది చేకూరనుంది. పెన్షనర్లు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఈ బీమా వర్తించనుంది. తొలుత సింగరేణి సంస్థలో ఈ బీమాను ప్రారంభించారు. ఇప్పటికే 45 మంది సింగరేణి కార్మికులు చనిపోతే కోటిన్నర బీమా చెల్లించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు కోటిన్నర బీమా అమలులో డిప్యూటీసీఎం భట్టి కృషి ఎంతో ఉందన్నారు. ఉద్యోగులంతా ప్రభుత్వంలో కుటుంబ సభ్యులు.. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తొలుత ఈ బీమా అమలుపై అనేక సందేహాలున్నా.. తర్వాత ఉద్యోగులకు సంక్షేమమే లక్ష్యంగా ఎంతో కసరత్తు చేశామన్నారు. బ్యాంకర్లను ఒప్పించి ఈ బీమాను కల్పించామన్నారు సీఎం. మరోవైపు విమాన ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగులకు రూ.3కోట్ల బీమా కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు నడుం బిగించాలని సీఎం పిలుపునిచ్చారు. ఉద్యోగులంతా రోజుకు ఒక గంట అదనంగా పని చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కొందరు పన్నులు కట్టకుండా తప్పించుకుంటున్నారని, అలాంటి వారిని గుర్తించి పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాక్స్ బకాయిలను కఠినంగా వసూలు చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంపొందించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. గత ప్రభుత్వ తీరుపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పాలకులు అత్యధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, గతంలో 11 శాతంగా ఉన్న వడ్డీ రేట్లను 7.5 శాతానికి తగ్గించగలిగామని వివరించారు. రాష్ట్రంలో తాము చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం మండిపడ్డారు. 'మూసీ నది పునరుజ్జీవనం చేద్దామంటే నా కాళ్లలో కట్టెలు పెడుతున్నారు. రీజనల్ రింగ్ రోడ్డు చేపడితే తప్పా? మెట్రో విస్తరణ చేద్దామన్నా, ఆర్ఆర్ఆర్ తెస్తామన్నా వద్దే వద్దని అడ్డుపడుతున్నారు. తమకు ఓట్లు వేయని ప్రజలు ఉంటే ఏంది, పోతే ఏంది అనే రీతిలో బీఆర్ఎస్ నేతలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు' అని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో అమెజాన్ పెట్టుబడుల వెల్లువ

మొదటిపేజీ తరువాయి..

అయ్యారు. అనంతరం ఈ పెట్టుబడి ప్రకటన వెలువడింది. "భారత్‌లో అమెజాన్ భవిష్యత్తు ప్రణాళికల గురించి ప్రధాని నరేంద్ర మోదీతో చర్చించాను. ఆయనతో భేటీని చాలా ఆస్వాదించాను. ఇండియాలో అమెజాన్ దశాబ్దం క్రితం



అడుగుపెట్టింది. అప్పటి నుంచి వినియోగదారులకు, విక్రేతలకు, డెవలపర్‌లకు, స్టార్టప్‌లకు, సంస్థలకు సేవలు అందిస్తున్నాం. కానీ ఇది మా ప్రస్థానంలో ఒక ఆరంభం మాత్రమే. రానున్న ఐదేళ్లలో భారత్‌లో మేము 48 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నాం. అందులో ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడిలో 21 బిలియన్ డాలర్ల వరకు ఉంటుంది" అని అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీ పేర్కొన్నారు.2030 నాటికి 3.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇవ్వడం, 80 బిలియన్ డాలర్ల ఈ-కామర్స్ ఎగుమతులను సాధించడం, 1.5 కోట్ల చిన్న వ్యాపారాలకు, 4 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ ప్రయోజనాలను అందించాలని యోచిస్తున్నాం. భారత్‌లో అమెజాన్ 2010 నుంచి ఇప్పటివరకు 40 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టింది. అలాగే గతేడాది చివర్లో 2026- 2030 మధ్య కాలంలో భారత్‌లో మరో 35 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించాం. అయితే ఈ రోజు ఆ పెట్టుబడి మొత్తాన్ని 48 బిలియన్ డాలర్లకు పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచవ్యాప్తంగా ఒక ముఖ్యమైన క్లౌడ్, ఏఐ కేంద్రంగా మారుతోందని అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీ తెలిపారు. ఇండియాలో ఉన్న భారీ డిమాండ్ కారణంగా తాము క్లౌడ్, ఏఐ రంగాల్లో పెట్టుబడులు పెట్టడాన్ని కొనసాగిస్తున్నామని ప్రకటించారు. అమెజాన్ పెట్టుబడిలో గణనీయమైన భాగం మార్కెట్‌ప్లేస్ వ్యాపారానికి సంబంధించినదేనని చెప్పారు. అయినప్పటికీ గతం కంటే ఈ రోజు తాము ప్రకటించిన 13 బిలియన్ డాలర్ల అదనపు పెట్టుబడులు క్లౌడ్, ఏఐ రంగాలపై దృష్టి సారించడానికేనని అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఉన్న దార్శనికత అద్భుతమైనది. దేశ అభివృద్ధిలోనూ, ప్రపంచవ్యాప్తంగా దాదాపు ప్రతి అంశంలోనూ భారత్ కీలక పాత్ర పోషిస్తోంది. నరేంద్ర మోదీతో సమయం గడిపే అవకాశం నాకు లభించింది. దేశాన్ని అన్ని విధాలుగా మరింత అభివృద్ధి పథంలో నడపడానికి మోదీ దగ్గర చాలా ఆలోచనలు ఉంటాయి. మోదీ ఐడియాలు ఎంతో అద్భుతంగా, ఆకట్టుకునేలా ఉన్నాయి" అని ఆండీ జాస్సీ వెల్లడించారు.మరోవైపు, భారత్‌లో అమెరికా ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ రికార్డు స్థాయిలో 48 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆసక్తిని ఇది చూపిస్తోందని పేర్కొన్నారు. అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీతో అద్భుతమైన సమావేశం జరిగిందన్నారు. దేశంలో అమెజాన్ రికార్డు స్థాయిలో 48 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఇన్వెస్ట్‌మెంట్లు దేశ యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తాయని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో మోదీ పోస్ట్ పెట్టారు.

## ఫీజు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదు

జీవో నంబర్ 9లోని కొన్ని నిబంధనలపై హైకోర్టు స్టే విధించింది. మంగళవారం వరకు స్టే విధిస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ హైకోర్టు పలు వ్యాఖ్యలు చేసింది. 'ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదు. మీరు బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల నుంచి యాజమాన్యాలు వసూలు చేయొద్దంటే కళాశాలను వారు ఎలా నడుపుతారు? రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారు?పెండింగ్ బకాయిలు ఎప్పటిలోపు చెల్లిస్తారు?' అని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పందిస్తూ ఆగస్ట్ 15లోపు బకాయిలు చెల్లిస్తామని బదులిచ్చారు. అలా జరిగితే తమ పిటిషన్లు కూడా వెనక్కి తీసుకుంటామని ప్రైవేట్ కళాశాలల తరఫు న్యాయవాది చెప్పారు.



ఇదే అంశంలో విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. విద్యార్థుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అటు ప్రభుత్వం, ఇటు కళాశాలల యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారన్నారు. ఈ బకాయిలతో విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును కోరారు. మంగళవారం అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని ప్రభుత్వం తరఫు న్యాయవాది చెప్పారు. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి ఉన్నత న్యాయస్థానం వాయిదా వేసింది.

## తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు

మొదటిపేజీ తరువాయి..

ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. రూ.51కోట్లతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పీల్ వే గేట్లను ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు,



రేవంత్ రెడ్డి, శివకుమార్ కలసి ప్రారంభిండం విశేషం. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులు, పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రులు వెళ్లారు. అంతకుముందు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా.. సమావేశానికి రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. అనంతరం ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నీటి సమస్యలపై కీలక చర్చలు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు.

## సర్ ప్రక్రియపై రాజకీయాలు తగవు

### ఇది రాజ్యాంగబద్ధ ప్రక్రియ మాత్రమే
### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్,జూన్25(సాక్ష్యం):
రాజ్యాంగబద్ధమైన సర్ పక్రియను రాజకీయం చేయొద్దని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 'సర్ పక్రియ ఒక చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన పక్రియ మాత్రమేనని, దీనిని ఏ ఒక్కరూ రాజకీయ కోణంలో చూడకూడదన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో




ఆయన మాట్లాడుతూ.. 'సర్ అనేది కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం దేశవ్యాప్తంగా జరిగే ఒక నిరంతర పక్రియ అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అదే సమయంలో నకిలీ లేదా అక్రమ ఓట్లను తొలగించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశమని వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో, క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఈ సవరణలు చేపడుతున్నారని ఆయన తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ అనేది ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన పక్రియ అని, దీనిపై కొన్ని రాజకీయ పక్షాలు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని కిషన్‌రెడ్డి హితవు పలికారు. కొన్ని రాజకీయ పార్టీలు ఈ పక్రియపై కావాలనే అపోహలు సృష్టిస్తూ, ప్రజలను, అధికారులను గందరగోళానికి గురిచేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇటువంటి సవరణలు జరిగాయని గుర్తుచేసిన కేంద్రమంత్రి, ఇప్పుడు దీనికి రాజకీయ రంగు పులమడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులూ లేని పారదర్శకత కోసం ప్రజలు కూడా ఈ 'ఃూఎఖీ' పక్రియలో భాగస్వాములు కావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఆపరేషన్ కవచ్‌తో వేటగాళ్ల గుట్టురట్టు

● 8 మంది అరెస్ట్.. 5 నాటుతుపాకులు, ఎయిర్ గన్ స్వాధీనం










**గాంధారి, జూన్ 25 ( సాక్ష్యం)** కామారెడ్డి జిల్లా పోలీసుల ప్రతిష్టాత్మక 'ఆపరేషన్ కవచ్'లో భాగంగా అడవి జంతువులను అక్రమంగా వేటాడుతున్న ముఠాను గాంధారి పోలీసులు పట్టుకుని, భారీ మొత్తంలో వేట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మొత్తం ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపారు. జూన్ 24 రాత్రి గాంధారి ఎస్ఐ మహేందర్ తన సిబ్బందితో కలిసి మొండి సడక్ చౌరస్తా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు మోటార్ సైకిళ్లపై వచ్చిన ఐదుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో వారి వద్ద నాటుతుపాకులు, గన్‌పౌడర్, స్టీల్ పెలెట్స్ లభించడంతో విచారణ చేపట్టారు. నిందితుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఎస్పీ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. విచారణలో నిందితులు బాన్సువాడ మండలం చిన్నరాంపూర్‌కు చెందిన అస్లాం చావుస్ వద్ద నుంచి మూడు నెలల క్రితం ఒక్కో నాటుతుపాకిని రూ.10 వేల చొప్పున కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. పోలీసులు గండివేట్ తండా పరిసర ప్రాంతాల్లో దాచిపెట్టిన మరో మూడు నాటుతుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోళ్ల ఫారం వద్ద తలదాచుకున్న ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి మొత్తం ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 5 నాటుతుపాకులు, ఒక ఎయిర్ గన్, మూడు ట్రిగ్గర్ మెకానిజంలు, మూడు బ్రెల్స్ (చాప్స్), భారీ మొత్తంలో మందుగుండు సామగ్రి, రెండు మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును సమర్థవంతంగా ఛేదించిన సదాశివనగర్ సీఐ బి. సంతోష్ కుమార్, గాంధారి ఎస్ఐ మహేందర్, తాడ్వాయి ఎస్ఐ నరేష్‌తో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అభినందించి నగదు బహుమతులు అందజేశారు. జిల్లాలో అక్రమ ఆయుధాలు, వన్యప్రాణుల వేటను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని, 'ఆపరేషన్ కవచ్' ద్వారా అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా కొనసాగుతుందని ఎస్పీ హెచ్చరించారు.

# గిరిజన కళాశాలల్లో అడ్మిషన్లకు పరీక్షల తిప్పలు

● ఖాళీ సీట్లు ఉన్నా ప్రవేశాలకు కొర్రీలు ● విద్యార్థులు, తల్లిదండ్రులకు అవస్థలు
● చర్యలు తీసుకోకుంటే కలెక్టరేట్ల ముట్టడి ● లంబాడి హక్కుల పోరాట సమితి



**గాంధారి, జూన్ 25( సాక్ష్యం)**
ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలల్లో ఖాళీ సీట్లు ఉన్నప్పటికీ ఎస్టీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అడ్మిషన్ల కోసం కళాశాలలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులను ప్రవేశ పరీక్షల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఎలాంటి ప్రవేశ పరీక్ష అవసరం లేదు. అయినప్పటికీ కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని కొన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు లంబాడి హక్కుల పోరాట సమితి సభ్యులు పరశురామ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు . ఈ విషయమై ప్రశ్నించగా రీజినల్ కోఆర్డినేటర్ ఆదేశాల మేరకే పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాళ్లు చెబుతున్నట్లు సమాచారం. మరోవైపు గురుకుల విద్యాసంస్థల ఉన్నతాధికారులు మాత్రం తాము అలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది. దీంతో అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టుకుంటూ గిరిజన విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై లంబాడి హక్కుల పోరాట సమితి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నాయకుడు బాధవత్ పరశురామ్ స్పందిస్తూ, గిరిజన విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించాల్సిన అధికారులు లేని నిబంధనలను సృష్టించి వేధించడం తగదన్నారు. జిల్లా కలెక్టర్లు వెంటనే జోక్యం చేసుకుని అడ్మిషన్ల ప్రక్రియను సులభతరం చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న రీజినల్ కోఆర్డినేటర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఖాళీగా ఉన్న సీట్లను వెంటనే భర్తీ చేయాలని, లేనిపక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

### అక్రమ పచ్చడి తయారీ

# కేంద్రంపై టాస్క్ ఫోర్స్ దాడి

● ఒకరి అరెస్ట్ ● రూ.2.25 లక్షల విలువైన కల్తీ నిల్వలు స్వాధీనం

**వరంగల్,25 జూన్(సాక్ష్యం)**
వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో అక్రమంగా పచ్చడి తయారీ, నిల్వలు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశీబుగ్గ సాయి వీధిలో ఉన్న ఓ నివాస గృహంలో నిర్వహించిన తనిఖీల్లో పెద్ద ఎత్తున కుళ్లిపోయిన పచ్చడి ముడిసరుకులు, ఆహార పదార్థాలు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వాటిని చిన్న ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి స్థానిక కిరాణా దుకాణాలు, ఇతర చిన్న వ్యాపార కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో అరికెల శ్రీనివాస్ (51), కాశీబుగ్గ నివాసినిబి అదుపులోకి తీసుకున్నారు. దాడిలో 750 కిలోల టమోటా, 900 కిలోల మామిడి, 200 కిలోల నిమ్మకాయలు, 100 కిలోల ఉసిరికాయలు, 150 కిలోల అల్లం-వెల్లుల్లి పేస్ట్‌తో కూడిన మొత్తం రూ.2,25,000 విలువైన కుళ్లిపోయిన, కల్తీ ఆహార నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సరుకును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు బ్రాండ్ లేని లేదా అనుమానాస్పద ఆహార పదార్థాలు, పచ్చళ్లను కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని టాస్క్ ఫోర్స్ అధికారులు సూచించారు. ఇలాంటి అక్రమ నిల్వ కేంద్రాలు లేదా కల్తీ ఆహార పదార్థాల విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ దాడిని ఏసీపీ టాస్క్ ఫోర్స్ ఎ. మధుసూదన్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బండారి రాజు, ఆర్ఎస్ఐ ఓ. భాను ప్రకాష్ మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బంది నిర్వహించారు.



# ఐఐఐటికి ఎంపికైన పేద విద్యార్థికి సర్పంచ్ ఘనసన్మానం



**బీబీపేట్ సాక్ష్యం జూన్ 25**
ంబీబీపేట్ మండలంలోని యాడవరం ప్రభుత్వ జిల్లా పరిషద్ హై స్కూల్ లో చదివి 546 మార్కులతో ఐఐటి బాసర లో సీట్ సంపాదించిన రాంచరణ్ అనే విద్యార్థినిని గురువారం రోజున యడారం సర్పంచ్ గొబ్బూరి సుధారాణి బాపురెడ్డి శాలవాతో ఘనంగా సన్మానించి మెమంటో ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యడారం లోని ఒక అనాధ ఆశ్రమంలో ఉంటూ గవర్మెంట్ పాఠశాలలో చదివి మంచి మార్కులతో సీట్ సంపాదించినందుకు,విద్యార్థికి, అలాగే విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ సుధారాణి బాపురెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, ఉపాధ్యాయబృందం, గ్రామపాలక వర్గం పాల్గొనడం జరిగింది.

### కిష్టాపూర్ గ్రామంలో

# పిచ్చి కుక్కల బీభత్సం: ముగ్గురికి గాయాలు

**బీర్కూర్, సాక్ష్యం జూన్ 25:** బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో పిచ్చి కుక్కల బెడద ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. గురువారం గ్రామంలో సంచరిస్తున్న ఓ పిచ్చి కుక్క ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి కాటు వేయడంతో వారు గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గ్రామంలో వీధి కుక్కల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల సమస్యను అరికట్టేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. పిచ్చి కుక్కలను పట్టుకుని గ్రామంలో ప్రజలకు రక్షణ కల్పించాలని పంచాయతీ అధికారులను విజ్ఞప్తి చేశారు.

# ప్రత్యేక ఓటరు సవరణ

• తాసిల్దార్ ఉమలత



**రామారెడ్డి జూన్ 25 (సాక్ష్యం)**
ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ స్పెషల్ ఇంకెన్స్ రివిజన్ సర్వేను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ సవరణ ప్రక్రియ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, జాబితాలో తప్పులను సరిదిద్దడం. జూన్ 25 నుండి బిఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి సర్వే చేయడం జరుగుతుంది. మీ ఓటరు కార్డులో మార్పులు లేదా కొత్త ఓటు నమోదు కోసం

**ఓటరు సవరణ**

ఫారం 6 కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి 18 ఏళ్లు నిండిన వారు. ఫారం 7 ఓటర్ల జాబితా నుండి పేరు తొలగించడానికి ఫారం 8 పేరు, పుట్టిన తేదీ, అడ్రస్, ఫోటో మార్పులు చేసుకోవడానికి, మరియు ఒకే నియోజకవర్గంలో ఒక పోలింగ్ బూత్ నుండి వేరొక దానికి మారడానికి. ఆన్‌లైన్‌లో సవరణ చేసుకునే విధానం. మీ ఇంటికి వచ్చే బూత్ లెవెల్ ఆఫీసర్ కు నేరుగా దరఖాస్తులు అందజేసి కూడా మీ ఓటును సవరించుకోవచ్చు. పూర్తి సమాచారం లేదా సందేహాల కోసం మీ దగ్గరలోని బిఎల్ఓ ను లేదా సంబంధిత ఓటరు జాబితా కార్యాలయము సందర్శించి ఓటర్ సవరణ ప్రక్రియను సవరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఉమలత, గ్రామ జిపిఓ దుర్గాప్రసాద్, బిఎల్ఓ వనిత, మంజుల, సంబంధిత ఓటరు మహిళలు పాల్గొన్నారు.

# నిజాంసాగర్ రోడ్డుపై పోలీసుల ఆకస్మిక వాహన తనిఖీలు

**నిజాంసాగర్, జూన్ 25:(సాక్ష్యం)**
ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బొగ్గు గుడిసె నుండి నిజాంసాగర్ వెళ్లే రహదారిపై ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. పోలీసు సిబ్బందితో కలిసి చేపట్టిన ఈ తనిఖీల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం 120 వాహనాలను తనిఖీ చేయగా, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం, ట్రిబుల్ రైడింగ్, నంబర్ ప్లేట్లు సక్రమంగా లేకపోవడం, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, మోడిఫైడ్ సైలెన్సర్ల వినియోగం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులపై 20 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రయాణ సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ పత్రాలను ఒరిజినల్ రూపంలో లేదా డిజిలాకర్, ఎం-పరివాహన్ యాప్‌లలో అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



**బీబీపేట్ సాక్ష్యం జూన్ 25**
బీబీపేట మండలంలోనీ మాందాపూర్ గ్రామానికి చెందిన తాటిచెట్టు బాలకిషన్ ఈ మధ్యనే ప్రమాదవశాత్తు మరణించగా బాధిత కుటుంబం మేము ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని తెలుపగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యకులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ 50 కిలోల బియ్యం బాధిత కుటుంబానికి అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంకన్నగారి నాగరాజ్ గౌడ్, గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వడ్ల తిరుపతి, సంఘం ప్రతినిధులు కమ్మరి గంగారాములు,వడ్ల శంకరయ్య, వడ్ల సురేష్ ,వడ్ల రమేష్, కమ్మరి శ్రీనివాస్, వడ్ల బాలచందర్, వడ్ల హరిప్రసాద్,వడ్ల ప్రేమ్ చారి, వడ్ల రాజశేఖర్,వడ్ల మనోజ్,వడ్ల లింగం,సలీం తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**రామారెడ్డి జూన్ 25 (సాక్ష్యం)** రామారెడ్డి మండల కేంద్రంలోని మంగలి రామస్వామి అనారోగ్యం కారణంగా పరమవదించారు. వారి కుటుంబానికి వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం 4 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివేకానంద ట్రస్ట్ సభ్యులు కడెం శ్రీకాంత్, మైపాల్, జిరిగారి రాజు, సందీప్, శ్రీనివాస్, అవినాష్, సంతోష్, చిట్టిబాబు, తదితరులు ఉన్నారు.

### కామారెడ్డిలో ఎరువుల దుకాణాన్ని

# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**కామారెడ్డి ప్రతినిధి జూన్ 25. (సాక్ష్యం)** జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్.వి. గిరితో కలిసి పట్టణంలోని కిసాన్ అగ్రి మార్ట్ ఎరువుల దుకాణాన్ని, గోదాం ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న యూరియా, ఇతర ఎరువుల నిల్వలను పరిశీలించి, మిగిలిన స్టాక్ వివరాలను వెంటనే సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని డీలర్‌కు ఆదేశించారు. ఎరువుల విక్రయాలు పూర్తిగా పారదర్శకంగా నిర్వహించడంతో పాటు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి యూరియా లభ్యత, బుకింగ్ యాప్ వినియోగంపై ఆరా తీశారు. యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ చేసుకోవడం వల్ల పారదర్శకత పెరుగుతుందని, రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేపడుతోందని తెలిపారు. ఎరువుల నిల్వలు,సరఫరా, విక్రయాల పై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, రైతులకు ఎలాంటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి మృతి



**రామారెడ్డి జూన్ 25 (సాక్ష్యం)** రామారెడ్డి గ్రామానికి చెందిన ఉయ్యాలకాడి దండబోయిన రాజనర్సు (52) తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుడి భార్య ఉయ్యాలకాడి దండబోయిన చిన్న లక్ష్మి ఫిర్యాదు మేరకు, రాజనర్సు గత మూడు సంవత్సరాలుగా ప్రమాదంలో కాళ్లు విరగడం,పక్షవాతం రావడంతో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆరోగ్య పరిస్థితి కారణంగా మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై పి. రాజశేఖర్ తెలిపారు.

# హత్యాయత్నం కేసులో రౌడీ షీటర్ అరెస్ట్ తల్వార్ స్వాధీనం, రిమాండ్‌కు తరలింపు

• శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కామారెడ్డి పోలీసుల ఉక్కుపాదం
• ప్రజల భద్రతకు సంపూర్ణ హామీ నేరస్థులకు ఉపేక్ష లేదు – కామారెడ్డి డిఎస్పి మధుసూదన్






**కామారెడ్డి ప్రతినిధి జూన్ 25. (సాక్ష్యం)**
ఫిర్యాదుదారుడు మహమ్మద్ అర్షద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, గతంలో ఇంటి ప్రహరీ గోడ వివాదానికి సంబంధించి ఏర్పడిన పాత కక్షల నేపథ్యంలో నిందితుడు అబ్దుల్ సల్మాన్ ఖాన్ తేది 22-06-2026 రాత్రి సమయంలో ఫిర్యాదుదారుడి ఇంటికి వెళ్లి, ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న ఆటో రిక్షా మరియు విద్యుత్ మీటర్‌ను ధ్వంసం చేశాడు. అనంతరం ఫిర్యాదుదారుడు మరియు అతని భార్యపై రాయితో దాడి చేసి గాయపరిచినట్లు, అలాగే తల్వార్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఫిర్యాదు అందింది. ఫిర్యాదు ఆధారంగా కామారెడ్డి టౌన్ పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు బతుకమ్మ కుంటలో పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా, తల్వార్‌తో బెదిరించి రాయితో దాడి చేసినట్లు వెల్లడైంది. నేరానికి ఉపయోగించిన 57 సెంటీమీటర్ల పొడవు గల తల్వార్‌ను (47 సెంటీమీటర్ల బ్లేడ్, 10 సెంటీమీటర్ల హ్యాండిల్) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు చట్టవిరుద్ధంగా ఆయుధాన్ని కలిగి ఉండి, దానిని నేరానికి ఉపయోగించినట్లు తేలడంతో భారత ఆయుధాల చట్టం-1959లోని సెక్షన్ 25(1బి)(బి)ను కూడా కేసులో చేర్చారు. దర్యాప్తులో నిందితుడు అబ్దుల్ సల్మాన్ ఖాన్ కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన రౌడీ షీటర్ అని, గతంలో హత్యాయత్నం సహా వివిధ నేరాలకు సంబంధించి మొత్తం 5 క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు. ఆయా కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లిన చరిత్ర కూడా ఉన్నట్లు వెల్లడైంది. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని డిఎస్పీ తెలిపారు. కామారెడ్డి డిఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులు, రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు ఎలాంటి నేరాలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కామారెడ్డి పోలీసులు హెచ్చరించారు. గూండాగిరి, బెదిరింపులు, దాడులు, అక్రమ ఆయుధాల వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలు లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే అంశాల గురించి సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. హత్యాయత్నం కేసులో రౌడీషీటర్‌ను చాకచక్యంగా గుర్తించి, అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి, కామారెడ్డి యస్ ఐ సాయికృష్ణ ని మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించినట్లు కామారెడ్డి డీఎస్పీ తెలిపారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బంది ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించినట్లు పేర్కొన్నారు

# ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో మూడో విడత అడ్మిషన్లు

## – కళాశాల ప్రిన్సిపల్ డా. కే. శ్రీలత

భూదాన్ పోచంపల్లి, జూన్ 25 (సాక్ష్యం): మండలంలోని దేశముఖి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి మూడో విడత (థర్డ్ ఫేజ్) అడ్మిషన్ల




ప్రక్రియ ఈ నెల 27, 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. కే. శ్రీలత తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ మూడు తేదీల్లో ఏదో ఒక రోజు నేరుగా కళాశాలకు హాజరై ఎంపిక ప్రక్రియలో పాల్గొనవచ్చని వెల్లడించారు. అభ్యర్థులు ఉదయం 6 గంటలలోపు కళాశాలకు చేరుకోవాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా శారీరక సామర్థ్య పరీక్ష (ఫిజికల్ టెస్ట్), వైద్య పరీక్ష (మెడికల్ టెస్ట్), వ్రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులై ఉండటంతో పాటు కనీసం 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలని, కంటి చూపు లోపాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు లేకపోవాలని అర్హతలుగా పేర్కొన్నారు. శారీరక పరీక్షల దృష్ట్యా ట్రాక్ ప్యాంట్, టీ–షర్ట్, షూస్ ధరించి రావాలని, అలాగే అవసరమైన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ప్రిన్సిపల్ డా. కే. శ్రీలత సూచించారు.

# రైతులకు పంట రుణాలు ఇవ్వాలని వినతి

నాంపల్లి,జూన్,25(సాక్ష్యం): ప్రతి రైతుకు రైతు భరోసా నేరుగా రైతుల ఖాతాలో జమ చేయాలని, రైతులకు వంట రుణాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సమస్యలపై నాంపల్లి డిప్యూటీ తహశీల్దార్ వెంకన్నకు వినతి పత్రం సమర్పించారు.



అనంతరం రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం మాట్లాడుతూ యూరియా యాపుతో ఇబ్బందులు పడుతున్నారు. యూరియా ఆఫ్ ను వెంటనే రద్దు చేయాలని, నకిలీ విత్తనాలు అరికట్టి నాణ్యమైన విత్తనాలు రైతులకు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలి. పెంచిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలి. పట్టా పుస్తకము ఉన్న ప్రతి రైతుకు నాబార్డ్ సేల్స్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారంగా పంట రుణాలు ఇవ్వాలి.రుణ మాఫీ పెండింగ్లో ఉన్న రైతులకు రుణమాఫీ చేసి తిరిగి రుణాలు చెల్లించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు కొమ్ము లక్ష్మయ్య, రైతు సంఘం నాయకులు పెరుమాండ్ల రాజేశ్వర్, కప్పెర లక్ష్మయ్య, ఎల్లమ్మ సైదులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ప్రకటించిన సన్నరకాలనే సాగు చేయాలి

## – ఏవో ఋష్యేంద్రమణి

మిర్యాలగూడ, జూన్ 24,( సాక్ష్యం ప్రతినిధి ): ప్రభుత్వం ప్రకటించిన సన్నరకాల వరి వంగడాలు సాగు చేసి లబ్ది పొందాలని మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారిణి మేకల ఋష్యేంద్రమణి కోరారు. గురువారం మిర్యాలగూడ మండలం ఆలగడప రైతు వేదికలో విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సన్నరకం వరి వంగడాలు





పిఎస్ఆర్ 15048, బీపీటీ 5204, కెఎన్ఎం 1638, హెచ్ఎంటీ, సోనా, డబ్ల్యూజీఎల్ 44, కెఎన్ఎం 7715,జై శ్రీరాం విత్తనాలుఅందుబాటులో ఉన్నాయన్నారు.నానో యూరియా , నానో డిఏపీ ఎరువులు అమ్మకానికిఅందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. ప్రభుత్వం సిఫార్సు చేసిన సన్నరకాల వరిని పండించి లబ్ది పొందాలని ఆమె కోరారు. రైతు భరోసా –2026 కోసం కొత్త పట్టాదారు పాస్ పుస్తకం పొందిన వారు ఆయా రైతు వేదికల్లో ఎఇఓలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మేళా లో ఆలగడప, అవంతిపురం సర్పంచ్లు ఇంద్రపల్లి కుమారి, వల్దాసు సుజాత, ఎఇఓ కెఎం.అఫ్రిన్, రైతులు బుచ్చిరెడ్డి, సోమయ్య, శ్రీకాంత్, వంశీ ఫీల్డ్ ఆఫీసర్ రంగారెడ్డి, వికాస్, మొగలరాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భూములు,ఆస్తుల రక్షణ కోసమే ' నక్షా

### నక్షా పై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలి

## కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి .. క్షేత్రస్థాయిలో పరిశీలన

మిర్యాలగూడ, జూన్ 25,( సాక్ష్యం ప్రతినిధి ): పట్టణ ప్రజల భూముల, ఆస్తుల రక్షణ కోసమే



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పైలెట్ ప్రాజెక్టుగా నక్షా కార్యక్రమం ఏర్పాటు చేసిందని మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి అన్నారు. పట్టణ ప్రణాళికా విభాగం మరియు వార్డు అధికారుల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న 'నక్షా ప్రాజెక్ట్' క్షేత్రస్థాయి పరిశీలనను గురువారం ఆమె స్వయంగా పర్యవేక్షిం చారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో వార్డు అధికారులు ఆర్ ఓ ఆర్ నమోదు ప్రక్రియను నిర్వహిస్తున్న తీరును కమిషనర్ నిశితంగా పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.నక్షా ప్రాజెక్ట్ అనేది ప్రజల భూములు, ఆస్తుల రక్షణకు సంబంధించిన అత్యంత కీలకమైన కార్యక్రమం. క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకుతావులేకుండా పారదర్శకంగా ఈ రికార్డుల నమోదు పూర్తి కావాలన్నారు.

నక్షా కార్యక్రమంపై ప్రజల్లో ఉన్నఅపోహలను తొలగించడమే మొదటి ప్రాధాన్యత కావాలని కమిషనర్ పేర్కొన్నారు. వార్డు అధికారులు ప్రజల వద్దకు వెళ్లేటప్పుడు నమ్రతతో, ఓపికతో వ్యవహరించాలని ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనాలను వారికి విడమర్చి చెప్పాలని సూచించారు.

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం వంద శాతం విజయవంతంకావాలంటే స్థానిక వార్డు కౌన్సిలర్ల సహకారం ఎంతో అవసరమని కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లోని ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలని కోరారు. అలాగే, నక్షా ప్రాజెక్ట్ విశిష్టతను ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లడంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు .

నక్షా రికార్డుల నమోదు సమయంలో వార్డు అధికారులుఎదుర్కొంటున్న సాంకేతిక, ఆచరణాత్మక ఇబ్బందులను కమిషనర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ప్రతి రోజూ ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోల ద్వారా నక్షా కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను ఆడియో రూపంలో వినిపిస్తూ ప్రజలనుచైతన్యపరుస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.వార్డు అధికారులు, కౌన్సిలర్లు స్థానికంగా ప్రజలతో నేరుగా మాట్లాడి అవగాహన కల్పించడం వల్ల పరస్పర నమ్మకం పెరుగుతుందని, దీనివల్ల రికార్డుల నమోదు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ప్రజలు పూర్తి సహకారం అందించాలి

### ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పరిశీలణ

### ఈనెల 25 నుండి వచ్చే నెల 24 వరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఎన్యూమరేషన్ కార్యక్రమం

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చంద్రశేఖర్

నల్గొండ జూన్ 25(సాక్ష్యం ప్రతినిధి ): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో (యస్ ఐ ఆర్) భాగంగా ఇంటింటికి వచ్చే బిఎల్ఓ, బిఎల్ఓ సూపర్వైజర్లకు ప్రజలు పూర్తి సహకారం





అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి .చంద్రశేఖర్ కోరారు. గురువారం నుండి ప్రారంభమైన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని రహమత్ నగర్ లో బి ఎల్ ఓ లు నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. రహమత్ నగర్ లో బిఎల్ఓ లు నిర్వహిస్తున్న ఇంటింటి సందర్శన కార్యక్రమంలో ఇంటింటి యజమానులతో, అలాగే బీఎల్ఓ లతో మాట్లాడారు. ఎంతమంది కుటుంబ సభ్యులు ఉన్నారని.....? ఎంతమంది ఓటర్లు ఉన్నారని.....? అడిగారు. అంతేకాక బిఎల్ఓ యాప్ అప్డేట్ చేసుకున్నారా అని బిఎల్ఓ ను ప్రశ్నించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 25 నుండి వచ్చే నెల 24 వరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఎన్యూమరేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా బిఎల్వోలు, బిఎల్ఓ సూపర్వైజర్లు ఇంటింటికి వచ్చి ఓటరు ఎన్యూమరేషన్ ఫామ్స్ ఇస్తారని, ఇందులో పూర్తి వివరాలను నమోదు చేసి అవసరమైన డాక్యుమెంట్లను జతపరచి ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. 2022 లో నిర్వహించిన సవరణ కార్యక్రమం ఆధారంగా తీసుకొని మ్యాపింగ్ చేయడం జరిగిందని, మ్యాపింగ్ కాని వారి వివరాలు కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 86% ఓటర్ మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు.సర్ కార్యక్రమం పై ఇది వరకే అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. తాసిల్దారులు, ఏఈఆర్వోలు, బి ఎల్ ఓ బి ఎల్ ఓ సూపర్వైజర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని, అలాగే ప్రజాప్రతినిధులకు కూడా సమావేశాలు నిర్వహించామని, బిఎల్ఓ, బిఎల్ఏ లు కూడా ఇల్లు తిరిగి ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందని, ఎవరైనా మ్యాపింగ్ సమయంలో అందుబాటులో లేకుంటే ప్రస్తుతం అందుబాటులో ఉన్నట్లయితే అలాంటి వారిని కూడా నమోదు చేయడం జరుగుతుందని, అందువల్ల ఓటర్లు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. తాత్కాలికంగా ఇతర ప్రాంతాలలో నివాసం ఉన్నవారు నివాసం ఉండే చోట ఓటును నమోదు చేయడం జరుగుతుందన్నారు. 2002 జాబితాలో పేరు ఉండి ప్రస్తుత జాబితాలో పేరు ఉన్నట్లయితే అలాంటి వారు ఎలాంటి ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని, అయితే వారి పిల్లలు, అలాగే గతంలో పేర్లు ఉండి ప్రస్తుతం లిస్టులో లేని వారు మాత్రం ఎన్నికల సంఘం పేర్కొన్న 12 రకాల ధ్రువపత్రాలలో ఏదో ఒకటి ఆధారంగా సమర్పించాలని చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఎక్కడ నివాసం ఉంటే అక్కడ ఓటారు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, నల్గొండ తహసిల్దార్ పరశురాం, కార్పొరేటర్ అమీనా ఫరీద్, తదితరులు ఉన్నారు.

# డివిజన్లో సర్ ప్రక్రియ ప్రారంభం

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆర్డిఓ

మిర్యాలగూడ, జూన్ 25, ( సాక్ష్యం ప్రతినిధి ): ప్రత్యేక ఓటర్ విస్తృత సవరణ (సర్)సర్వేను దామరచర్లలో



ఆర్డిఓ రమణారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘ నియమావళిని అనుసరించి ప్రత్యేక విస్తృత సవరణ సర్వే ఆధారంగా ప్రతి ఓటర్ పూర్తి వివరాలను నమోదు చేయాలని 1987కు ముందు ఓటరుగా నమోదైన వ్యక్తులకు స్వీయ గుర్తింపు కార్డు 1987 నుండి 2004 మధ్యలో ఓటర్గా నమోదైన వారు స్వీయ గుర్తింపు కార్డుతో తల్లి లేదా తండ్రి ఏదేని ఆధార పత్రాన్ని జతపరచాలని 2004 తర్వాత ఓటరుగా నమోదైన వారు స్వీయ గుర్తింపు కార్డుతో పాటు తల్లి, తండ్రి ఆధార పత్రాలను జత చేయాలని కోరారు. ప్రతి బిఎల్ఓ ప్రాంతంలో ఉన్న అన్ని విషయాలపై సమగ్ర అవగాహన కలిగి గణన ఫారాలను ప్రతి ఓటరుకు పంపిణీ చేసి, వారి వివరాలను ఈసీఐ నెట్ యాప్ లో నమోదు చేసి, లేనివారి వివరాలను ఫామ్ 6 ద్వారా సేకరించి, ఇతర ప్రాంతాల ఓటర్ కు సంబంధించిన వివరాలను ఫామ్ 8 ద్వారా సేకరించి ఓటర్ జాబితాను తయారు చేయాలని ఓటర్ల నమోదుపై అవగాహన ఏర్పరచుకొని క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తప్పులు లేని, పరిపూర్ణ ఓటర్ల జాబితాను నమోదు చేయాలని బూత్ లెవెల్ ఏజెంట్లు బిఎల్ఓలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. మిర్యాలగూడ తహసీల్దార్ సహాయ ఎన్నికల అధికారి పి.శ్రీనివాస్ మిర్యాలగూడ పట్టణంలోని వినోభానగర్, ముత్తిరెడ్డికుంట పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ సర్వే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దామరచర్ల తహసీల్దార్ జవహర్లాల్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు రజినీకాంత్, నాగమణి, సతీష్,




ఆర్ఐలు టీ.రామకృష్ణ , కృష్ణయ్య, పవన్, సూపర్వైజర్లు, బిఎల్వో, బిఎల్ఎలు పాల్గొన్నారు.

# సర్ ఇంటింటి సర్వేపై అఖిలపక్ష సమావేశం

మునగాల, జూన్ 25 (సాక్ష్యం): సర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజియన్ ) ఇంటింటి సర్వే ప్రక్రియపై గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరిత అధ్యక్షతన అఖిలపక్ష రాజకీయ పార్టీల మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరిత మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూన్ 25 నుంచి




జూలై 24 వరకు నెల రోజులపాటు సర్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లకు సర్వేపై అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీల నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి ఓటరు సర్వేలో పాల్గొని తమ పూర్తి వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు పలు సందేహాలను వ్యక్తం చేయగా, తహసీల్దార్ వాటిని నివృత్తి చేస్తూ వివరణ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, సీపీఐ మండల కార్యదర్శి సీహెచ్ సీతారామ్, బీజేపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, సీపీఎం నాయకుడు, కలకోవ గ్రామ సర్పంచ్ మందవ వెంకటాద్రి, కాంగ్రెస్ నాయకుడు, మునగాల గ్రామ ఉపసర్పంచ్ కాసర్ల వెంకట్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, బీజేపీ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ స్వప్న, ఆర్ఐలు రామారావు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## సర్ ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో

మునగాల, జూన్ 25 (సాక్ష్యం): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సర్ (ఎస్ఐఆర్) ఇంటింటి సర్వే నమోదు ఫారాల పంపిణీ కార్యక్రమం గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది.



ఈ నేపథ్యంలో మునగాల గ్రామంలో చేపట్టిన సర్వే నమోదు ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణ తీరును, ఫారాల పంపిణీ విధానాన్ని ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి అర్హుడైన ఓటరుకు ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ సరిత, సీనియర్ అసిస్టెంట్ స్వప్న, ఆర్ఐ రామారావు, పలువురు బీఎల్వోలు పాల్గొన్నారు. అనంతరం మునగాల గ్రామ సర్పంచ్ నల్లపాటి ప్రమీల నివాసంలో నిర్వహించిన సర్ ఇంటింటి సర్వే ఫారాల పంపిణీ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణతో పాటు అధికారులు పాల్గొని ప్రజలకు సర్వేపై అవగాహన కల్పించారు. సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

## ఓటర్లు సర్వేను సవరించుకోవాలి

నిడమానూరు,జూన్ 25(సాక్ష్యం)ః ఓటర్ల పేర్లు తప్పుగా ఉంటే వాటిని సవరించుకోవాలని అందుకు సర్ అప్ ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించాలని బిఎల్వో లకు సూచించినట్లు తహశీల్దార్ జంగాల కృష్ణయ్య అన్నారు. గురువారం నిడమానూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి ఓటర్ సర్వే నిర్వహించి ఓటర్ల జాబితాను పరిశీలించాలి తెలిపారు.



211 పోలింగ్ స్టేషన్ లు నిడమానూరు తహశీల్దార్ కృష్ణయ్య తనిఖీ చేశారు .ఓటర్ల పేర్లు ఇంటి పేర్లు తప్పుగా ఉంటే సవరించుకోవాలని సూచనలు ఇచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ బిఎల్ఓ లకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిడమానూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం,డిటి, సర్పంచ్లు,పంచాయతీ కార్యదర్శి లు, ఏఎస్ వో ,బిఎల్వో ,గ్రామస్థులు, తదితరులు, పాల్గొన్నారు.

### మల్లాపూర్ సమస్యల పరిష్కారానికి

## అధికారులతో కాంగ్రెస్ నేతల క్షేత్ర పర్యటన



**ఉప్పల్, జూన్ 25 (సాక్ష్యం):** మల్లాపూర్ డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ, రహదారులు, వర్షపు నీటి నిల్వ వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు అధికారులను కోరారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సూచనల మేరకు ఎంఎంసీ ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా సంబంధిత అధికారులతో కలిసి గురువారం మల్లాపూర్ డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓల్డ్ మల్లాపూర్ సీసీ రహదారి ప్రాంతం, నోమా ఫంక్షన్ హాల్ రోడ్ నుంచి గాంధీ విగ్రహం వరకు ఉన్న డ్రైనేజీ సమస్యలను కాంగ్రెస్ నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలను పరిశీలించిన అధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే సంబంధిత పనులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధుల మంజూరుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నెమలి అనిల్ కుమార్, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు కప్పర సాయి కిరణ్ గౌడ్, డీసీసీ కార్యదర్శులు దంతూరి రాజు గౌడ్, కోయగూర బాలరాజ్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెరుపుల బాలరాజ్, బెల్లం శ్రీను, ముజీబ్, వి. శ్రీనివాస్, మల్లాపూర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జయంత్, ఉపాధ్యక్షుడు వంగవీటి రింకు, కాంగ్రెస్ నాయకురాళ్లు జమీలా బేగం, శైలజ గౌడ్, సోనీ గౌడ్, ఇష్రాత్ భాను తదితరులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### ఓటరు జాబితా సవరణలో

## ప్రజలందరూ భాగస్వాములు కావాలి

**– ఎన్యుమరేషన్ ఫారం నింపి బీఎల్ఓకు అందజేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



**మహబూబ్‌నగర్, జూన్ 25 ( సాక్ష్యం బ్యూరో )** భారత ఎన్నికల సంఘం జూన్ 25 నుంచి జూలై 24 వరకు చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి గురువారం రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామంలో బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) నుంచి ఎన్యుమరేషన్ ఫారాన్ని స్వీకరించి, తన వివరాలను నమోదు చేసి తిరిగి బీఎల్ఓకు అందజేశారు. రంగారెడ్డి గూడలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్యే గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాన్ని పూరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు బీఎల్ఓలకు అవసరమైన వివరాలు అందించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు సక్రమంగా నమోదై ఉండేలా ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే బీఎల్ఓలు అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, జాగ్రత్తగా ఈ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. సవరణ ప్రక్రియలో ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలందరూ ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందించి, అవసరమైన సమాచారం, పత్రాలను సకాలంలో సమర్పించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే తప్పులేని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ఎన్నికల శాఖ అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### సీజ్‌లు, హెచ్చరికలు బేఖాతరు..

## అక్రమ నిర్మాణం మళ్లీ యదేచ్ఛగా..!

**– నిబంధనలను తుంగలో తొక్కిన నిర్మాణదారులు**

**– అడ్డుకున్న ఏసీపీ జ్యోత్స్నకు వేధింపులా..?**








**మహబూబ్‌నగర్, జూన్ 25 (సాక్ష్యం బ్యూరో)** మహబూబ్‌నగర్ నగరంలో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. గతంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సీజ్ చేసిన భవనంలోనే మళ్లీ నిర్మాణ పనులు కొనసాగడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అధికారుల హెచ్చరికలు, సీజ్ ఆదేశాలు, చట్టపరమైన చర్యలను బేఖాతరు చేస్తూ నిర్మాణదారులు మరోసారి పనులు చేపట్టినట్లు సమాచారం. అధికారికంగా సీజ్ చేసిన నిర్మాణ ప్రాంతంలో పనులు కొనసాగుతున్నాయని సమాచారం అందడంతో మున్సిపల్ కార్పొరేషన్ ఏసీపీ జ్యోత్స్న సంఘటనా స్థలానికి చేరుకుని పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. అయితే ఆమె విధి నిర్వహణలో అడ్డంకులు సృష్టించడమే కాకుండా, మహిళా అధికారి అన్న గౌరవం కూడా లేకుండా ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ నిర్మాణంపై మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సీజ్ చర్యలు తీసుకున్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా తిరిగి పనులు ప్రారంభించడం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చట్టాన్ని ధిక్కరించే ధైర్యం నిర్మాణదారులకు ఎలా వచ్చిందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన సమయంలో అధికారుల ఆదేశాలను బహిరంగంగా ఉల్లంఘించడం, సీజ్ చేసిన భవనంలోనే పనులు కొనసాగించడం మున్సిపల్ పరిపాలన ప్రతిష్ఠకు సవాల్‌గా మారిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు విధులు నిర్వర్తిస్తున్న మహిళా అధికారిని అవమానించేలా ప్రవర్తించారన్న ఆరోపణలు నిజమైతే, సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు మాట్లాడుతూ, సీజ్ చేసిన నిర్మాణంలో మళ్లీ పనులు జరుగుతున్నాయంటే ఇది కేవలం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదని, చట్టాన్ని బహిరంగంగా సవాల్ చేయడమేనని పేర్కొన్నారు. ఈ ఘటనపై మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. "సీజ్ చేసినా నిర్మాణం... అడ్డుకుంటే అధికారులకే అవమానం" అనే పరిస్థితి నెలకొనడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ఈ వ్యవహారంపై మున్సిపల్ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

### ఆదర్శ్ పీజీ కళాశాలలో ఐబిఎం

## ఏఐ శిక్షణ కార్యక్రమం విజయవంతం

**– విద్యార్థుల్లో కృత్రిమ మేధపై అవగాహన పెంపు**

**– భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు దోహదం**




**మహబూబ్‌నగర్, జూన్ 25 ( సాక్ష్యం బ్యూరో )** మహబూబ్‌నగర్ పట్టణంలోని ఆదర్శ్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ఆఫ్ కంప్యూటర్ సైన్సెస్‌లో నిర్వహించిన ఐ బి ఎం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. జూన్ 22 నుంచి 24 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐ బిఎం – ఏఐ ట్రైనర్లు విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాథమిక అంశాలు, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, జనరేటివ్ – ఏఐ, అలాగే లింకెడిన్, గిట్ హబ్ వంటి వృత్తిపరమైన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగంపై శిక్షణ అందించారు. అదనంగా సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. డిగ్రీ, ఎంబీఏ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విలువైన జ్ఞానాన్ని పొందారు. శిక్షణ కార్యక్రమం ద్వారా భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస అంశాలపై అవగాహన పెరిగిందని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్. గౌలయ్య, కరస్పాండెంట్ బి. రాములు, కోఆర్డినేటర్ వి. అరుణ్ కుమార్ రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. ప్రభాకర్, ఎంబీఏ విభాగాధిపతి డి.వి. రాకేష్ జాదవ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ షేక్ రమేష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మహ్మద్ తాజుద్దీన్, మహ్మద్ అబ్దుల్ అఫ్జల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని కళాశాల నిర్వాహకులు పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులను సన్నద్ధం చేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించిందన్నారు.

### మాదకద్రవ్యాల

## నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు

**– రుద్ర జాగిలంతో హోటళ్లు, షాపుల్లో ఆకస్మిక తనిఖీలు**



**మహబూబ్‌నగర్, జూన్ 25 (సాక్ష్యంబ్యూరో)** మాదకద్రవ్యాల నిరోధక వారోత్సవాల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు డీఎస్పీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ధర్మపూర్ గ్రామ పరిధిలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు డాగ్ స్క్వాడ్‌కు చెందిన రుద్ర జాగిలం సహాయంతో గ్రామంలోని పలు హోటళ్లు, షాపులు మరియు ఇతర వ్యాపార సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమణారెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో పోలీసులతో పాటు ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగం లేదా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జిల్లా పోలీసు శాఖ మాదకద్రవ్యాల నిర్మూలనకు నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణయ్య, ఆర్ఎస్ఐ రమేష్, డాగ్ హ్యాండ్లర్ శంకర్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందాలి

**– ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం**

**ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి పలితాలు సాధించే దిశగా కార్యాచరణతో సాగాలి**

**– ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో గుర్తించిన సమస్యలు ప్రాధాన్యత ననుసరించి పరిష్కరించాలి**

**– ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, పంచాయతీ రాజ్,**

**గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ జిల్లా యంత్రాంగానికి దిశా నిర్దేశం**

**మహబూబ్‌నగర్, జూన్ 25 ( సాక్ష్యం బ్యూరో )** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ కార్యాలయం లో సమీక్షించిన జిల్లా ప్రత్యేక అధికారి ,పంచాయితీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్ ప్రభుత్వ ప్రాధాన్యత సంక్షేమ పథకాలను, అర్హులందరికీ అమలు చేయడమే కాక ప్రజల ఆకాంక్షలను,




సమస్యలు పరిష్కరించేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జిల్లా ప్రత్యేక అధికారి,పంచాయితీ రాజ్,గ్రామీణాభి వృద్ధి శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన ఎం. దాన కిశోర్ అన్నారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో ప్రభుత్వం 10 థీములతో షెడ్యూల్ ప్రకారం ఆయా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతం కావడం జరిగిందని పేర్కొన్నారు.జిల్లాలో విజయవంతంగా అమలు చేసినందుకు జిల్లా యంత్రాంగం ను అభినందించారు. ప్రజల ఆకాంక్షల మేరకు నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమం లక్ష్యం నెరవేర్చేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా వివిధ శాఖలు చేపట్టిన కార్యక్రమాల్లో,గ్రామ,వార్డ్ సభల సందర్భంగా గుర్తించిన ప్రజల సమస్యలు,మౌలిక వసతుల కల్పన సమస్యలు,పరిష్కారం చేసిన వాటి వివరాలు,పెండింగ్ లో నున్నవి పరిష్కారం కు కార్యచరణ రూపొందించి ప్రణాళిక,ఆర్థిక అవసరాల అంచనా వేయాలని అన్నారు..నిధులతో సంబంధం లేనివి తక్షణం పరిష్కరించాలని అన్నారు కేటగిరి వారిగా ప్రతి శాఖ సమస్య గుర్తించి వాటిని విధంగా పరిష్కారం చేయుటకు కావల్సిన వనరులు




గుర్తించాలని,నిధులు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వం కు పంపాలని అన్నారు ప్రతి శాఖ చేపట్టిన కార్యక్రమాలు పలితాలు సాధించే దిశగా కార్యాచరణ ఉండాలని అన్నారు. గ్రామ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ భవనాలు లేని చోట ఈ.జి.ఎస్ కింద మంజూరు చేసి వచ్చే 9 నెలల్లో భవనాలు పూర్తి చేయాలని ఆయన సూచించారు .కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ లను నిర్మాణం చేయాలని డి.ఆర్.డి.ఓ కు సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరణ తగు చర్య తీసుకోవాలని,ప్లాస్టిక్ తో కార్పొరేషన్ పరిధిలో రోడ్డు నిర్మాణం చేయాలని మున్సిపల్ కమిషనర్ కు



సూచించారు ప్రతి శాఖ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సాధించిన పలితాలు,విజయ గాథలు,ఉత్తమ,వినూత్న పద్ధతులపై 15 రోజుల్లో బుక్ లెట్ రూపొందించాలని ఆయన సూచించారు. .ఇందుకు ప్రతి శాఖ అధికారి చొరవ చూపి తాము సమస్యల పరిష్కారానికి అనుసరించిన వినూత్న పద్ధతులు నమోదు చేయాలని అన్నారు జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఎస్.ఎచ్.జి.మహిళలకు నిర్వహించిన ప్రత్యేక హెల్త్ క్యాంపు లలో పరీక్షల్లో వచ్చిన రిపోర్ట్ లు పరిశీలించి వారికి గల సమస్యలు పరిష్కారం చేయాలని డి.ఆర్.డి.ఓ కు సూచించారు. ఆర్.బి.ఎస్.కె. ద్వారా పాఠశాలలు,గురుకుల పాఠశాలలలో హెల్త్ క్యాంపులు,గ్రామాల్లో మహిళలకు నిర్వహించిన వైద్య శిబిరాల్లో



గుర్తించిన అనీమియా,డయాబెటిస్,గైనిక్,కంటి సంబంధిత సమస్యలు పరిశీలించి వారికి అందరికీ కావలసిన వైద్యం అందించాలని అన్నారు. ఫార్మా కంపెనీ లతో మాట్లాడి సి.ఎస్.ఆర్ నిధులతో కంటి సంబంధిత వ్యాధులున్న వారికి అవసరమైన మందులు,కళ్లద్దాలు అందించాలని సూచించారు.జిల్లాలో వివిధ ప్రాంతాలనుండి వచ్చి చదువుకుంటున్న బాలికలకు హాస్టళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిని ఆదేశించారు. జాతీయ రహదారులుపై ప్రమాదాలు జరిగే హాట్ స్పాట్స్ గుర్తించి అక్కడ, దాభాలు ఉన్న చోట రోడ్డు భద్రతా పై ప్రజా పాలన కార్యక్రమం లో భాగంగా సైన్ బోర్డు లు ప్రముఖంగా ఏర్పాటు చేయాలని ఎస్.పి.,ట్రాన్స్పోర్ట్ అధికారిని ఆదేశించారు.



వివిధ శాఖల్లో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును నిరంతర ప్రక్రియగా పేర్కొంటూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని సూచించారు. కొన్ని విషయాల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉ




ంటుందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్ లలో ఎక్కువ మంది పిల్లలను చేర్పించి సమర్థంగా నిర్వహించాలని జిల్లా విద్యా శాఖ అధికారికి సూచించారు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో గుర్తించిన సమస్యలు పరిష్కారం దిశ గా సాగాలని సూచించారు..ప్రజా పాలన ప్రగతి పాలన 99 రోజుల




కార్యక్రమం కాదని, నిరంతర కార్యక్రమం అని,సమస్యలు పరిష్కరించుటకు సంబంధిత అధికారులు చొరవ చూపాలని అన్నారు. మార్చి ఆరవ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పాత ఫైల్స్ క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించామన్నారు. 99 రోజుల షెడ్యూల్ ప్రకారం వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల గురించి తెలియజేశారు. . వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలను గురించి తెలిపారు. . పోలీసు శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ వారోత్సవాల్లో రహదారి భద్రతపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఉద్యానవన, క్రీడలు యువజన సర్వీసులు, సంక్షేమ, అటవీ, తదితర శాఖల ఆధ్వర్యంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాల గురించి కూడా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరించారు. అంతకుముందు జిల్లా లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో వివిధ శాఖల అధికారులు చేపట్టిన కార్యక్రమాలను పి.పి.టి.ద్వారా సమావేశం లో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి.డి జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ,అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని,జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, తదితరులు పాల్గొన్నారు



### గ్రామాల నుంచే డ్రగ్స్
# రహిత సమాజం ప్రారంభం కావాలి
### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ




**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ (సాక్ష్యం జూన్ 25)** జూన్ 26 అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గూడూరు మండలం ఎర్రకుంట తండా గ్రామపంచాయతీ పరిధిలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి రాజు కృష్ణ మాట్లాడుతూ ఒకప్పుడు కేవలం నగరాలకే పరిమితమైన మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారి,నేడు గ్రామీణ ప్రాంతాలకు,గిరిజన తండాలకు వేగంగా విస్తరిస్తోందని ఇది గ్రామాల్లోని శాంతిభద్రతలను దెబ్బతీయడమే కాకుండా,దేశ భవిష్యత్తు అయిన యువతను నిర్వీర్యం చేస్తోందన్నారు.గ్రామీణ ప్రాంతాలు నేడు డ్రగ్స్ వినియోగానికే కాకుండా,అక్రమ రవాణాకు కూడా కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. పోలీసుల నిఘా తక్కువగా ఉండే మారుమూల రహదారులు, అటవీ ప్రాంతాల ద్వారా డ్రగ్స్ అక్రమ రవాణా సాగుతోందని,నిరుపేద కూలీలను,అమాయక



గ్రామీణ యువతను డ్రగ్స్ వ్యాపారులు డబ్బు ఆశ చూపి క్యారియర్లుగా (రవాణా చేసేవారిగా)వాడుకుంటున్నారు.మాదకద్రవ్యాల రవాణా అనేది చట్టప్రకారం అత్యంత తీవ్రమైన నేరం.ఎన్‌డిపిఎస్ (చీణూూ) చట్టం కింద దీనికి కఠినమైన జైలు శిక్షలు,జరిమానాలు విధిస్తారు.దీనివల్ల అమాయక గ్రామీణ కుటుంబాలు కోర్టులు,జైళ్ల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అందిస్తున్నటువంటి సేవలను గురించి వివరించారు. ఉచిత న్యాయ సలహా మరియు సహాయం కొరకు 15100 ను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ రాజశేఖర్,కార్యదర్శి సుధీర్,కారోబార్ వాసు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

### జిల్లా ప్రత్యేక అధికారి డా హరీష్
# సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలి

**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ సాక్ష్యం జూన్ 25)** జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి, జెన్కో సీఎండీ డా. ఎస్.హరీష్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరిష్‌తో కలిసి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు.డా. హరీష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామ,వార్డు స్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించగలిగామని తెలిపారు. 10 థీమ్‌ల ఆధారంగా వివిధ శాఖలు నిర్వహించిన కార్యక్రమాలు విజయవంత మయ్యాయని అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు,విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు శాఖల మధ్య సమన్వయం అవసరమని చెప్పారు.ఆరోగ్య శాఖలో టిబి,మధుమేహం వంటి వ్యాధులతో పాటు ఇతర కేసులను గుర్తించి సమగ్ర డేటా సేకరణకు అవకాశం ఏర్పడిందన్నారు.వ్యవసాయ రంగంలో భూసార పరీక్షల ఆధారంగా రైతులకు లాభదాయక పంటలపై అవగాహన



కల్పించాలని సూచించారు. పామాయిల్, కూరగాయలు, పసుపు, సేంద్రీయ వ్యవసాయం వంటి వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. యూరియా వినియోగాన్ని తగ్గించి నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సమాచారమందించిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులతో ఉపాధ్యాయులు ఇంగ్లీష్‌లో సంభాషించాలని సూచించారు. టాస్క్ ఆధ్వర్యంలో యువతకు ఐటీ,కమ్యూనికేషన్,స్పోకెన్ ఇంగ్లీష్, డిజిటల్ మార్కెటింగ్ తదితర రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్,పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త మరుగుదొడ్ల నిర్మాణం,మరమ్మతులు చేపట్టినట్లు వివరించారు. గంగారం మండలం ఆస్పిరేషనల్ బ్లాక్‌గా ఎంపిక కావడంతో నిర్దేశిత లక్ష్యాల్లో మంచి పురోగతి సాధించామని తెలిపారు.బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో కేసుల తగ్గింపు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు,డెంగ్యూ, మలేరియా నివారణ చర్యలు, స్థానిక సంస్థల ప్రతినిధులకు శిక్షణ, ప్రైవేట్ పాఠశాల వాహనాల తనిఖీలు, డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పురుషోత్తం, డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు, జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్రతో పాటు వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# యువత చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలి
### – ఎస్ఐ రాంమెహన్

**ఖానాపురం జూన్25 ( సాక్ష్యం న్యూస్ ) :** యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ,విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాల పై దృష్టి సారించాలని ఖానాపురం ఎస్ ఐ రాంమెహన్ అన్నారు. ఖానాపురం మండలం అశోక్ నగర్ లోని సైనిక్ స్కూల్ వద్ద పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ...విద్యార్థులకు, యువతకు, ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల పై వివరించారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తి ఆరోగ్యంతో



పాటు కుటుంబం సమాజం పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపక బృందం స్థానిక ప్రజలు కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా వినియోగం పై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత హెల్ప్‌లైన్ 100 ,1908 నంబర్లకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైనిక స్కూల్ ప్రిన్సిపల్ సురేందర్ ,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
### – యువత భవిష్యత్తును కాపాడుకోవాలి: ఓయూ పోలీసులు

**సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 25:** మాదకద్రవ్యాల వినియోగం యువత జీవితాలను నాశనం చేస్తుందని, వాటికి దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు విద్యార్థులకు పిలుపునిచ్చారు. నగర పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే జూనియర్ కళాశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైల్వే జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ సీతాఫల్మండి, రవీంద్రనగర్, పార్థిబస్తీ ప్రాంతాల మీదుగా సాగి తిరిగి కళాశాల వద్ద ముగిసింది. సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ ర్యాలీలో ప్రజలకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు క్షణికానందాన్ని కలిగించినప్పటికీ జీవితాలను అంధకారంలోకి నెట్టివేస్తాయని తెలిపారు. వీటి వినియోగం వల్ల మెదడు, గుండె, కాలేయం వంటి కీలక అవయవాలు దెబ్బతినడంతో పాటు విద్యార్థుల చదువుపై ప్రభావం చూపి భవిష్యత్తు అవకాశాలను దూరం చేస్తుందని హెచ్చరించారు. అంతేకాకుండా




మానసిక ఆందోళన, నిరాశ, వ్యసనం వంటి సమస్యలకు దారితీస్తుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కరపత్రాలను పంపిణీ చేసి మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వంటి అంశాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్, ఉప నిరీక్షకుడు జయచందర్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల
# నిర్మూలనకు సమాజమంతా కదలాలి
### – నషా ముక్త్ భారత్ అభియాన్‌లో జిల్లా ఎస్పీ జానకి పిలుపు







**మహబూబ్‌నగర్, జూన్ 25 ( సాక్ష్యం బ్యూరో )** మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మహబూబ్‌నగర్ స్టేడియం గ్రౌండ్‌లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ జానకి మాదకద్రవ్యాల వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించి, సిగ్నేచర్ క్యాంపెయినింగ్ బోర్డుపై సంతకం చేశారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, యువత, సీనియర్ సిటిజన్లతో కలిసి మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని పేర్కొన్నారు. ఒక వ్యక్తి మాదకద్రవ్యాలకు బానిసైతే అతనితో పాటు కుటుంబం, సమాజం కూడా తీవ్ర ప్రభావానికి గురవుతుందని అన్నారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి సారించి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను నిశితంగా గమనించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వ్యసన రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరూ సహకరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా, డీఎల్ఎస్ఏ బృందం, జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి, వర్నిక ఎన్‌జీఓ ప్రతినిధులు, జిల్లా అధికారులు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ అజాజుద్దీన్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువత, సీనియర్ సిటిజన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్స్, మత్తు పదార్థాల రహిత సమాజం
### – జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట జిల్లా కరస్పాండెంట్ సాక్ష్యం (జూన్ 25)** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళ, శిశు, దివ్యాంగుల ఒ వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా పోలీస్ మరియు ఎక్సైజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల హాల్‌లో జిల్లా స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరై, యువత సైబర్ నేరాలు మరియు మాదకద్రవ్యాల బానిసత్వానికి దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.జిల్లా ఎస్పీ కె నరసింహ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండి యోగా, ధ్యానం, క్రీడలపై దృష్టి పెట్టాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ



చేయించారు.జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించగా, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వెంకటరమణ జీవిత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ వెంకటయ్య, ఎక్సైజ్ అధికారులు, కళాశాల అధ్యాపకులు, మెడికల్, నర్సింగ్ మరియు ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం..
# యువతే మార్పుకు మార్గదర్శి!

**మహబూబ్‌నగర్, జూన్ 25 ( సాక్ష్యం బ్యూరో)** మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, యువత భవిష్యత్తును కాపాడేందుకు సమాజం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నివారణ వారోత్సవాల్లో భాగంగా గురువారం ప్రభుత్వ వొకేషనల్ బాలుర కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తును కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించే



పోస్టర్‌ను విడుదల చేశారు. విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఇతరులకు కూడా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వ్యసనం ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా నేరాలకు దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్న ఆయన, ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

### అమ్మ పేరుతో మొక్క నాటి
## పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి: సుక్క గణేశ్ ముదిరాజ్

**సికింద్రాబాద్, జూన్ 25 (సాక్ష్యం):** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయవంతంగా 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమం లాలాపేట్‌లో ఘనంగా జరిగింది. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇంద్రానగర్ సత్యనగర్ శివాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుక్క గణేశ్ ముదిరాజ్ నాయకత్వం వహించారు. వెనుకబడిన వర్గాల మోర్చా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సుక్క గణేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. చెట్ల పెంపకం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, వెనుకబడిన వర్గాల మోర్చా పదాధికారులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



### ఉమ్మడి మహబూబ్‌నగర్
# సాగునీటి హక్కుల కోసం పోరాటం చేయాలి
### – మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిసిన పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి నాయకులు

**మహబూబ్‌నగర్, జూన్ 25 ( సాక్ష్యం బ్యూరో )** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, జిల్లాకు హక్కుగా రావాల్సిన నీటి వాటా సాధన కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీటి రంగంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయించడంతో పాటు జిల్లాకు హక్కుగా రావాల్సిన నీటిని సాధించేందుకు తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని వారు కోరారు. జిల్లాలోని సాగునీటి సమస్యల పరిష్కారం కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, రైతు సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వారి వినతిని ఆలకించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీటి ప్రాజెక్టులు అత్యంత కీలకమని పేర్కొన్నట్లు సమాచారం. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు, జిల్లాకు రావాల్సిన నీటి హక్కుల సాధనకు తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సాధన సమితి నాయకులు, రైతు ప్రతినిధులు, ప్రజా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.ం



# ప్రత్యేక ఓటరు సవరణ
### బియెల్ఓ భీంరావు

**బిచ్కుంద.జూన్ 25 (సాక్ష్యం)** ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ స్పెషల్ ఇంకెన్స్ రివిజన్ సర్వేను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ సవరణ ప్రక్రియ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, జాబితాలో తప్పులను సరిదిద్దడం. జూన్ 25 నుండి బిఎల్ లు ఇంటింటికీ తిరిగి సర్వే చేయడం జరుగుతుంది.మీ ఓటరు కార్డులో మార్పులు లేదా కొత్త ఓటు నమోదు కోసంఓటరు సవరణఫారం 6 కొత్తగా ఓటు హక్కు నమోదు



చేసుకోవడానికి 18 ఏళ్లు నిండిన వారు.ఫారం 7 ఓటర్ల జాబితా నుండి పేరు తొలగించడానికి ఫారం 8 పేరు, పుట్టిన తేదీ, అడ్రస్, ఫోటో మార్పులు చేసుకోవడానికి, మరియు ఒకే నియోజకవర్గంలో ఒక పోలింగ్ బూత్ నుండి వేరొక దానికి మారడానికి.ఆన్లైన్లో సవరణ చేసుకునే విధానం. మీ ఇంటికి వచ్చే బూత్ లెవెల్ ఆఫీసర్ కు నేరుగా దరఖాస్తులు అందజేసి కూడా మీ ఓటును సవరించుకోవచ్చు. పూర్తి సమాచారం లేదా సందేహాల కోసం మీ దగ్గరలోని బిఎలే ను లేదా సంబంధిత ఓటరు జాబితా కార్యాలయము సందర్శించి ఓటర్ సవరణ ప్రక్రియను సవరించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో. గ్రామ సర్పంచ్.గ్రామ పంచాయతీ కార్యదర్శి. జ్యోతి..బి.యెల్.ఓ భీంరావు గ్రామ లైనె మెన్. మహేష్. మాజీ ఉపసర్పంచ్ గంగాధర్. సునీత గిరి.సంబంధిత ఓటరు మహిళలు పాల్గొన్నారు.



# సుదీర్ఘ విరామం తర్వాత మైదానంలోకి నెయ్‌మర్

## స్కాట్లాండ్‌పై 3-0 తేడాతో బ్రెజిల్ ఘనవిజయం

2026 ఫిఫా ప్రపంచకప్‌లో ఫుట్‌బాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. బ్రెజిల్ దిగ్గజ ఆటగాడు నెయ్‌మర్ జూనియర్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టాడు. 2026 ఫిఫా ప్రపంచకప్‌లో భాగంగా స్కాట్లాండ్‌తో జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో నెయ్‌మర్ బరిలోకి దిగాడు.

ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 3-0 తేడాతో బ్రెజిల్ ఘనవిజయం సాధించి, టోర్నీలో నాకౌట్ దశకు దూసుకెళ్లింది. నెయ్‌మర్ 2023 అక్టోబర్ తర్వాత బ్రెజిల్ తరఫున మళ్లీ ఇప్పుడే మైదానంలోకి వచ్చాడు. ఆ సమయంలో ఉరుగ్వేతో జరిగిన ప్రపంచకప్ క్వాలిఫైయర్ మ్యాచ్‌లో అతనికి మోకాలికి తీవ్రమైన గాయం అయింది. ఆ తర్వాత ఇటీవలే పిక్క గాయం కూడా వేధించింది. దీంతో అతను దాదాపు రెండేళ్లపాటు ఆటకు పూర్తిగా దూరమయ్యాడు. ఇటీవల ఫిట్‌నెస్ సాధించిన నెయ్‌మార్ స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో 76వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మథ్యూస్ కున్హా స్థానంలో మైదానంలోకి అడుగుపెట్టాడు. ఆ సమయంలో అభిమానుల కరతాళ ధ్వనులు ఈ మ్యాచ్‌కే హైలైట్. ఈ మ్యాచ్‌లో ఆడటం ద్వారా నెయ్‌మర్ తన అంతర్జాతీయ కెరీర్‌లో ఒక మైలురాయిని అందుకున్నాడు. ఇది అతనికి నాలుగో ఫిఫా ప్రపంచకప్ టోర్నమెంట్. అంతకుముందు అతను 2014, 2018, 2022 ప్రపంచకప్ ఎడిషన్లలో ఆడాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్రెజిల్ మొదటి నుంచీ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బ్రెజిల్ స్టార్ ప్లేయర్ వినీషియస్ జూనియర్ ఫస్ట్ హాఫ్‌లోనే రెండు సూపర్ గోల్స్‌తో మెరిశాడు. మ్యాచ్ ప్రారంభమైన 7వ నిమిషంలోనే జట్టుకు తొలి గోల్ అందించాడు. హాఫ్-టైమ్‌కు కొద్ది నిమిషాల ముందు హెడర్ ద్వారా రెండో గోల్ చేసి బ్రెజిల్‌ను 2-0తో ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత సెకండ్ హాఫ్‌లో మథ్యూస్ కున్హా మూడో గోల్ సాధించడంతో బ్రెజిల్ 3-0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ రెండు గోల్స్‌తో వినీషియస్ రికార్డును సొంతం చేసుకున్నాడు. ప్రపంచకప్‌లో బ్రెజిల్ ఆడిన మొదటి మూడు మ్యాచ్‌ల్లోనూ వరుసగా గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. గత 24 ఏళ్లలో ఏ బ్రెజిల్ ఆటగాడికీ ఇది సాధ్యం కాలేదు. దీనితో అతను 2002 ప్రపంచకప్‌లో ఈ ఘనత సాధించిన దిగ్గజాలు రొనాల్డో నజారియో, రివాల్డోల రికార్డును సమం చేశాడు. స్కాట్లాండ్‌పై విజయంతో బ్రెజిల్ జట్టు గ్రూప్-సిలో మొత్తం 7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి నాకౌట్ (సూపర్-16) దశకు అర్హత సాధించింది. ఇదే గ్రూప్ నుంచి మొరాకో జట్టు కూడా నాకౌట్‌కు చేరింది. ఫిఫా ప్రపంచకప్ 2026లో గ్రూప్-బి చివరి లీగ్ మ్యాచ్‌లో ఉత్కంఠభరిత పోరు సాగింది. వ్యాంకోవర్ వేదికగా జరిగిన ఈ హోరాహోరీ సమరంలో స్విట్జర్లాండ్ 2-1 తేడాతో కెనడాపై ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో స్విట్జర్లాండ్ గ్రూప్ టాపర్‌గా నిలిచింది. అయితే ఓటమి పాలైనప్పటికీ కెనడా జట్టు తమ ఫుట్‌బాల్ చరిత్రలోనే తొలిసారిగా ప్రపంచకప్ నాకౌట్ దశకు అర్హత సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. మ్యాచ్ ఆరంభం నుంచి ఇరు జట్లు ఢీ అంటే ఢీ అన్నట్లుగా ఆడాయి. కెనడా డిఫెండర్లు, స్విస్ ఆటగాళ్లు హోరాహోరీగా తలపడటంతో మొదటి హాఫ్ ముగిసే సమయానికి ఇరు జట్లు ఎలాంటి గోల్స్ సాంధించలేకపోయాయి. సెకండ్ హాఫ్ ప్రారంభమైన వెంటనే స్విట్జర్లాండ్ వ్యూహాన్ని మార్చింది. కేవలం ఒక్క నిమిషంలోనే స్విస్ ఆటగాడు రూబెన్ వర్గాస్ అద్భుతమైన ఫీల్డ్ మూవ్‌ను గోల్‌గా మలిచి జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ షాక్ నుంచి కెనడా తేరుకోకముందే, 57వ నిమిషంలో కెనడా డిఫెన్స్ చేసిన పొరపాటును అనుకూలంగా మార్చుకున్న జోహన్ మంజంబి లో-ఫినిష్‌తో బంతిని నెట్‌లోకి పంపి స్విట్జర్లాండ్ ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. రెండు గోల్స్ వెనుకబడిన కెనడా పుంజుకోవడానికి గట్టిగా ప్రయత్నించింది. ఈ క్రమంలో 76వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి వచ్చిన ప్రామిస్ డేవిడ్ వచ్చిన వెంటనే గోల్ కొట్టి కెనడాను తిరిగి రేసులోకి తెచ్చాడు. మ్యాచ్ ముగిసే సమయానికి స్కోరు సమం చేయడానికి కెనడా విపరీతంగా ప్రయత్నించింది. కానీ, అది సాధ్యపడలేదు. దీనితో స్విట్జర్లాండ్ 2-1తో విజయాన్ని ఖాయం చేసుకుంది.

## శతకంతో చెలరేగిన సాయి సుదర్శన్

శ్రీలంక-ఏతో జరుగుతున్న అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్-ఏ ఓపెనర్ సాయి సుదర్శన్(175 బంతుల్లో 19 ఫోర్లతో 132) శతకంతో చెలరేగాడు. దాంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 4 వికెట్లకు 333 పరుగులు చేసింది.సాయి సుదర్శన్‌తో పాటు కెప్టెన్ ధ్రువ్ జురెల్(138 బంతుల్లో 5 ఫోర్లతో 68 బ్యాటింగ్), తెలుగు తేజం షేక్ రషీద్(92 బంతుల్లో 4 ఫోర్లతో 53) అజేయ హాఫ్ సెంచరీలతో రాణించారు. శ్రీలంక-ఏ బౌలర్లలో సుదీర రెండు వికెట్లు తీయగా.. చామిక గుణశేఖర, రావిందు ఫెర్నాండో తలో వికెట్ తీసారు.గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు సాయి సుదర్శన్, ఆయుష్ పాండే(25) అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 82 పరుగులు జోడించారు. ఆయుష్ పాండేను తిలకరత్నే ఔట్ చేయగా.. దేవదత్ పడిక్కల్ సాయంతో సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.అయితే పడిక్కల్(12) ఎల్బీగా వెనుదిరిగాడు. ఈ పరిస్థితుల్లో రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ ఇద్దరూ ఆచితూచి ఆడటంతో పరుగుల వేగం తగ్గింది. మూడో వికెట్‌కు 85 పరుగులు జోడించిన అనంతరం రుతురాజ్ గైక్వాడ్(22) ఎల్బీగా పెవిలియన్ చేరాడు. క్రీజులోకి ధ్రువ్ జురెల్ రాగా.. సాయి సుదర్శన్ శతకం పూర్తి చేసుకున్నాడు. సెంచరీ అనంతరం సాయి సుదర్శన్‌ను గుణశేఖర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు.తెలుగు తేజం షేక్ రషీద్‌తో కలిసి ఆచితూచి ఆడిన ధ్రువ్ జురెల్ మరో వికెట్ పడకుండా తొలి రోజు ఆటను ముగించాడు. ఈ ఇద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకోవడంతో ఐదో వికెట్‌కు అజేయంగా 116 పరుగుల భాగస్వామ్యం నమోదైంది.



# వన్డే ప్రపంచకప్ 2027లో రో-కో ఆడాలి

## సెలక్టర్లకు రవిచంద్రన్ అశ్విన్ సూచన

వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడటంపై వస్తున్న పుకార్లకు రవిచంద్రన్ అశ్విన్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. వీరిద్దరిపై పనిగట్టుకుని కొందరు నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డాడు. తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వచ్చే ప్రపంచకప్‌లో రో-కో కచ్చితంగా ఆడాలని స్పష్టం చేశాడు. అలాగే బీసీసీఐ సెలక్టర్లు కూడా వీరి భవితవ్యంపై ఇప్పుడే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటే.. ఎలాంటి గందరగోళం లేకుండా వారు పూర్తి వస్తోందో తెలియడం లేదు. కొందరు మాత్రం ఈ ఇద్దరు ప్రపంచ కప్‌లో ఆడకూడదని గట్టిగా కోరుకుంటున్నారు. ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో మాత్రం అర్థం కావడంలేదు. కొందరేమో వారు ఆడకపోవచ్చని అనుమానాలు వచ్చేలా మాట్లాడుతున్నారు. మరికొందరు మాత్రం రో-కో ఉంటేనే బాగుంటుందంటారు. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్, కోహ్లీ తప్పకుండా ఆడాలి” అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.




నమ్మకంతో టోర్నీకి సిద్ధమవుతారని అశ్విన్ సూచించాడు. టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ .. భవితవ్యంపై భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు.

వన్డే ప్రపంచకప్ 2027లో ఆడటమే లక్ష్యంగా రోహిత్, కోహ్లీ అడుగులు వేస్తున్నారు. కానీ వారు ఈ మెగా టోర్నీలో ఆడతారా.. లేదా అనే అంశంపై బీసీసీఐ ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడం లేదు. కొందరు.. రోకో ప్రపంచకప్ ఆడరని.. మరికొందరు ఆడాలని కామెంట్లు చేస్తున్నారు. ఇదే విషయంపై అశ్విన్ మాట్లాడాడు. వీరిపై సెలక్టర్లు వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించాడు. ఇటీవల కాలంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గురించి వస్తున్న వార్తలు బాలేవు. కొందరు పనిగట్టుకుని నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. అసలు ఎక్కడ నుంచి ఇలాంటి నెగెటివ్ ప్రచారం ఇదే సమయంలో అశ్విన్.. భారత సెలక్టర్లకు కీలక సూచన చేశాడు. “దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచ కప్‌లో కోహ్లీ, రోహిత్ ఉండాలని మీరు కోరుకుంటే.. ఇప్పుడే నిర్ణయం తీసుకోండి. అలా చేయడం వల్ల టోర్నీ నాటికి వారు పూర్తి సన్నద్ధతతో, విశ్వాసంతో ఉంటారు. ఒకవేళ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే.. ముమ్ముందు ఈ అంశం మరింత సంక్లిష్టంగా మారుతుంది. గందరగోళానికి దారి తీస్తుంది” అని రవిచంద్రన్ అశ్విన్ తన మనసులోని మాటను బయటపెట్టాడు. రోహిత్, కోహ్లీ టెస్ట్, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. రోహిత్ ఇటీవల అఫ్గాన్‌తో వన్డే సిరీస్‌లో రాణించాడు. గాయం కారణంగా కోహ్లీ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీరిద్దరూ పాల్గొనే అవకాశం ఉంది.

## అక్షితా రాజ్‌తో ఆకాశ్ దీప్ వివాహం

భారత పేస్ బౌలర్ ఆకాశ్ దీప్ ఇటీవల పెళ్లి చేసుకున్నాడు. తన పెళ్లికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. అయితే పెళ్లిక హాజరైన ఓ అతిథి రోహిత్, కోహ్లి, ధోనీని ఎందుకు పిలవలేదు అంటూ అడగ్గా.. ఆకాశ్ దీప్ చమత్కారంగా సమాధానమిచ్చాడు. వారణాసికి వాళ్లు వచ్చి ఉంటే పెళ్లి ఎవరైనా జరిగనిచ్చేవారా? అంటూ ఫన్నీగా చెప్పాడు. ప్రస్తుతం గాయాల భారిన పడ్డ ఆకాశ్ దీప్ జట్టులో చోటు కోల్పోయాడు. టీమిండియా పేస్ బౌలర్ ఆకాశ్ దీప్ ఇటీవల వారణాసిలో అంగరంగ వైభవంగా అక్షితా రాజ్‌ను వివాహం చేసుకున్నాడు. తన పెళ్లి వేడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అభిమానులు, టీమిండియా ఫ్యాన్స్ అందరూ ఆకాశ్‌కు కామెంట్స్ రూపంలో శుభాకాంక్షలు తెలిపారు. అయితే, ఈ వివాహానికి హాజరైన ఓ అతిథి ఆకాశ్ దీప్‌ను ఓ ఆసక్తికర ప్రశ్న అడగ్గా, అంతకంటే ఇంట్రెస్టింగ్ ఆన్సర్ ఇచ్చాడు ఆకాశ్ దీప్. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీని వివాహానికి ఎందుకు ఆహ్వానించలేదంటూ ఒక అతిథిని ఆకాశ్ దీప్‌ను ప్రశ్నించాడు. దానికి ఆకాశ్ దీప్ సరదాగా స్పందిస్తూ వాళ్లు వస్తే ఇక్కడ వారణాసిలో పెళ్లి జరగనిస్తారా? అంటూ ఫన్నీగా జవాబిచ్చాడు. ధోనీ, విరాట్, రోహిత్ వంటి స్టార్ క్రికెటర్లు పెళ్లికి హాజరైతే భారీ సంఖ్యలో అభిమానులు తరలివస్తారు..



# వైభవ్ సూర్యవంశీకి ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్

భారత సీనియర్ క్రికెట్ జట్టులోకి దూసుకొచ్చిన 15 ఏళ్ల ఓపెనింగ్ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రానికి ముందే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. త్వరలో జరగబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం భారత జట్టులో చోటు దక్కించుకున్న ఈ టీనేజ్ స్టార్, బ్రిటన్ కలిసి డ్రెస్సింగ్ రూమ్‌లను గానీ, షవర్ (స్నానపు) గదులను గానీ పంచుకోవడానికి వీల్లేదు. ఇది ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు యొక్క భద్రతా ఫ్రేమ్‌వర్క్‌లో ఒక భాగం. 16 ఏళ్ల లోపు ఉన్న ఆటగాళ్లు పెద్దలతో కలిసి ఒకే డ్రెస్సింగ్ రూమ్ వాడటాన్ని ఇది నిషేధిస్తుంది. స్వతంత్ర క్రికెట్




పర్యటనలో ఒక వింతైన పరిస్థితిని ఎదుర్కోబోతున్నాడు. అతను మైనర్ (చిన్నపిల్లవాడు) కావడంతో అక్కడి ‘మైనర్ల రక్షణ నిబంధనల’ ( ప్రకారం అతనికి పర్యటన పొడవునా ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. యునైటెడ్ కింగ్‌డమ్ క్రికెట్ నిబంధనల ప్రకారం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని ‘అండర్-16’ ఆటగాడిగా (మైనర్‌గా) పరిగణిస్తారు, పెద్దవాడిగా కాదు. బ్రిటన్ చట్టాల ప్రకారం మైనర్లయిన ఆటగాళ్లు వయసులో పెద్దవారైన మిగతా జట్టు సభ్యులతో నియంత్రణ సంస్థ తో పాటు మ్యాచ్‌లు జరిగే స్టేడియాల సేఫ్‌గార్డింగ్ అధికారులు ఈ నియమాలను పర్యవేక్షిస్తారు. ఈ ఆంక్షలు ఉన్నప్పటికీ, వైభవ్ సూర్యవంశీ జట్టులోని మిగతా సభ్యులతో కలిసి టీమ్ మీటింగ్‌లు, వ్యూహాత్మక చర్చలు, వార్మ్-అప్ సెషన్లు, మ్యాచ్ రోజున జరిగే అన్ని కార్యక్రమాల్లోనూ సాధారణంగానే పాల్గొంటాడు. ఈ పరిమితులు కేవలం మ్యాచ్ దుస్తులు మార్చుకునేటప్పుడు లేదా షవర్ ఉపయోగించేటప్పుడు మాత్రమే వర్తిస్తాయి. ఆ సమయంలో అతనికి కేటాయించిన ప్రత్యేక ప్రైవేట్ గదిని ఉపయోగించాలి. ఒకవేళ ప్రధాన డ్రెస్సింగ్ రూమ్‌ను ఉపయోగించాల్సి వస్తే, మిగతా ఆటగాళ్లు ఎవరూ లేని సమయంలో నిర్దేశిత టైంలో మాత్రమే అతనికి అనుమతి ఉంటుంది. భారత్-ఇంగ్లాండ్ సిరీస్ అనేది రెండు దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కానీ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే టోర్నమెంట్ కాదు. కాబట్టి ఈ విషయంలో ఐసీసీకి ఎలాంటి అధికారం ఉండదని నివేదికలు స్పష్టం చేశాయి. “ఈ సేఫ్‌గార్డింగ్ నిబంధనలు ద్వైపాక్షిక సిరీస్‌లకు వర్తించవు. భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ సిరీస్ ఐసీసీ ఈవెంట్ కాదు కాబట్టి అండర్-16 క్రికెటర్ల కోసం ప్రత్యేక ఐసీసీ రూల్స్ ఏవీ లేవు. ఇది పూర్తిగా యూకే దేశ చట్టం, ఇందులో ఐసీసీ జోక్యం చేసుకోలేదు” అని హిందుస్థాన్ టైమ్స్ పత్రిక ఒక అధికారిక ప్రతినిధి మాటలను ఉటంకించింది. భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఇదే రకమైన నిబంధనలను పాటిస్తామని ‘క్రికెట్ ఐర్లాండ్’ స్పష్టం చేసింది. క్రికెట్ ఐర్లాండ్ ప్రతినిధి మాట్లాడుతూ.. “పెవిలియన్‌లో భారత జట్టు కోసం మూడు విడివిడి గదులను కేటాయించాం, అలాగే సేఫ్‌గార్డింగ్ చట్టాల గురించి వారికి వివరించాం. నిబంధనలన్నీ సక్రమంగా అమలు జరిగేలా మేము పర్యవేక్షిస్తాం, అయితే బీసీసీఐ కూడా యూకే చట్టాల ప్రకారం ఈ విషయాలను హ్యాండిల్ చేస్తుంది. మా విధానాలు బ్రిటన్ లోని ఉత్తమ పద్ధతులకు అనుగుణంగానే ఉన్నాయి” అని తెలిపారు. ఏదేమైనా ఒక అంతర్జాతీయ పర్యటనలో ఒక భారత ఆటగాడి కోసం ఇలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం క్రికెట్ చరిత్రలో చాలా అరుదైన విషయమనే చెప్పాలి.

## సన్‌రైజర్స్ హైదరాబాద్‌లోకి నూర్ అహ్మద్

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే ఆటగాళ్ల బదిలీల వ్యవహారం క్రికెట్ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ పదవి నుంచి తప్పుకున్న రిషబ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్తుండటం.. బదులుగా కుల్దీప్ యాదవ్ లక్నో జట్టులోకి వస్తున్నాడనే వార్తలతో ట్రేడింగ్ మార్కెట్ ఇప్పటికే వేడెక్కింది. ఈ క్రమంలోనే సీఎస్కే స్టార్ స్పిన్నర్ ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన నూర్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి ట్రేడ్ చేయబోతున్నారంటూ ఎక్స్ వేదికగా ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న సోషల్ మీడియా పోస్టుల ప్రకారం.. సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం తమ జట్టులోకి ఓ మంచి స్పిన్నర్‌ను తీసుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తోందని.. అందులో భాగంగానే సీఎస్కే స్పిన్నర్ నూర్ అహ్మద్ ప్రదర్శన పట్ల ఆరెంజ్ ఆర్మీ యాజమాన్యం ఎంతో నమ్మకంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2027 టోర్నీ కంటే ముందే ఓ బలమైన స్పిన్ బౌలింగ్ కాంబినేషన్‌ను సిద్ధం చేయడానికి ఎస్‌ఆర్‌హెచ్ ఇతర జట్ల స్పిన్నర్లపై కూడా కన్నేసిందని నెటిజన్లు పేర్కొంటున్నారు. అంతేకాకుండా సన్‌రైజర్స్ హైదరాబాద్‌లోని కొందరు ఆటగాళ్లను తీసుకోవడానికి సీఎస్కే కూడా ఆసక్తి చూపిస్తోందని.. ప్రస్తుతం ఈ చర్చలు ప్రాథమిక దశలోనే ఉన్నాయని ఎక్స్ వేదికగా ప్రచారం జరుగుతోంది. అయితే దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక ఆధారాలు లేవు. ఇవన్నీ కేవలం సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లు మాత్రమే. గతంలో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన నూర్ అహ్మద్.. ఐపీఎల్ 2025 సీజన్ నుంచి సీఎస్కే జట్టులో భాగమయ్యాడు. ఆ సీజన్లో 14 మ్యాచ్‌ల్లో 24 వికెట్లు పడగొట్టి టోర్నీలోనే రెండో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఆ తర్వాత ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు సీఎస్కే రీటైన్ చేసుకున్న కొద్దిమంది ఆటగాళ్లలో నూర్ అహ్మద్ ఒకడు. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభంలో నూర్ అహ్మద్ కాస్త తడబడినప్పటికీ.. మొత్తంగా 14 మ్యాచ్‌ల్లో 13 వికెట్లతో పర్వాలేదనిపించాడు. అయితే ఈ రెండు సీజన్లలోనూ చెన్నై జట్టు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలోనే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకుంటారనే ప్రచారం కూడా జరిగింది, కానీ ఆయన ఐపీఎల్ 2027లోనూ సీఎస్కే కోచ్‌గా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నూర్ అహ్మద్ ట్రేడింగ్‌పై వస్తున్న వార్తలు ప్రస్తుతానికి కేవలం పుకార్లు మాత్రమేనని స్పష్టమవుతోంది.




## రోహిత్ శర్మ సక్సెస్ సీక్రెట్ ఇదే..

క్రికెట్ మైదానంలో పరుగుల వరద పారించే టీమిండియా స్టార్ ఓపెనర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ బ్యాటింగ్ స్టైల్‌కు కోట్లాది మంది అభిమానులున్నారు. అయితే కఠోర శ్రమ, అద్భుతమైన ప్రతిభతో పాటు రోహిత్ సక్సెస్ వెనుక కొన్ని సీక్రెట్స్, నమ్మకాలు ఉన్నాయనే విషయం మీకు తెలుసా? ఆటగాళ్ల నమ్మకాలు.. హిట్‌మ్యాన్ సెంటిమెంట్లు..: క్రికెట్ ప్రపంచంలో ప్రతిభ ఎంత ముఖ్యమో.. అదృష్టం కూడా అంతే కీలకమని చాలామంది ఆటగాళ్లు నమ్ముతుంటారు. మైదానంలోకి అడుగుపెట్టే ముందు ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అలవాటు లేదా సెంటిమెంట్ ఉంటుంది. పూర్వకాలం నుంచి నేటి తరం ఆటగాళ్ల వరకు ఏదో ఒక నమ్మకాన్ని గుడ్డిగా అనుసరిస్తూనే ఉన్నారు. మన భారత జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఇందుకు మినహాయింపు కాదు. తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో ఎన్నో అద్భుత విజయాలు సాధించిన రోహిత్.. ప్రతి మ్యాచ్‌కు ముందు మూడు ప్రత్యేకమైన అలవాట్లను, సెంటిమెంట్లను తూచా తప్పకుండా పాటిస్తుంటారు.కాఫీ గ్లాసుతోనే రోహిత్ రోజు షురూ..: రోహిత్ శర్మ రోజువారీ జీవితంలో కాఫీకి ఒక ప్రత్యేక స్థానం ఉంది. మ్యాచ్ ఉన్న రోజు




ఉదయం నిద్ర లేవగానే హిట్‌మ్యాన్ కచ్చితంగా కాఫీ గ్లాసుతోనే తన రోజును ప్రారంభిస్తారు. ఉదయాన్నే కాఫీ తాగడం వల్ల ఆ రోజంతా తనకు ఎంతో అదృష్టం కలిసివస్తుందని రోహిత్ బలంగా నమ్ముతారు. మ్యాచ్ రోజుల్లో కాఫీ తాగడానికి ముందే టీ లేదా ఎలాంటి పండ్ల రసాలను ముట్టుకోవడానికి కూడా ఆయన ఇష్టపడరు. కేవలం వేడి వేడి కాఫీ మాత్రమే తన మానసిక స్థితిని మార్చి, మైదానంలో రాణించేలా చేస్తుందని రోహిత్ సెంటిమెంట్. భార్య రితికకు ఫోన్ కాల్.. విజయానికి అసలు మంత్రం..: మైదానంలో ఎంత ఒత్తిడి ఉన్నా.. టీమ్ మీటింగ్‌కు వెళ్లే ముందు రోహిత్ శర్మ తన భార్య రితికా సజ్దేకు కచ్చితంగా ఫోన్ చేస్తారు. రితికతో మాట్లాడటం రోహిత్‌కు మానసిక ప్రశాంతతను ఇవ్వడమే కాకుండా, మైదానంలో భారీ స్కోర్లు సాధించడానికి ఒక అదృశ్య శక్తిలా పనిచేస్తుందని ఆయన భావిస్తారు. సాధారణంగా రితికా సజ్దే ప్రతి మ్యాచ్‌లోనూ స్టేడియంలో కూర్చుని రోహిత్‌ను ప్రోత్సహిస్తూ కనిపిస్తుంటారు. అయితే మ్యాచ్ ప్రారంభానికి ముందు ఆమెతో మాట్లాడటం హిట్‌మ్యాన్ విజయ రహస్యాల్లో అత్యంత ముఖ్యమైనది. కుడికాలే ముఖ్యం.. ఒత్తిడిని జయించే రహస్యం..: ఇక మూడవ, అత్యంత ఆసక్తికరమైన సెంటిమెంట్ ఏంటంటే.. రోహిత్ శర్మ బ్యాటింగ్ చేయడానికి మైదానంలోకి అడుగుపెట్టేటప్పుడు ఎల్లప్పుడూ తన కుడికాల్ని మొదట లోపల పెడతారు. ప్రపంచ క్రికెట్‌లో చాలా మంది దిగ్గజాలు ఈ కుడికాలి సెంటిమెంట్‌ను పాటిస్తారు. దీనితో పాటు, మైదానంలో ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు రోహిత్ స్టేడియంలో తనకు నచ్చిన ఒక నిర్దిష్టమైన స్థలాన్ని లేదా వైపును నిరంతరం చూస్తూ ఉంటారు. అలా చూడటం వల్ల తన మనసుకు ప్రశాంతత లభిస్తుందని, ఎంతటి కఠినమైన పరిస్థితులనైనా ఎదుర్కొనే ధైర్యం వస్తుందని రోహిత్ నమ్ముతారు.



# ఘనంగా 'వెంకట్రామయ్య గారి తాలూకా' టీజర్, పాటల ఆవిష్కరణ

దినేష్ కుమార్ హీరోగా, ప్రముఖ నటుడు ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా'. సతీష్ ఆవాల దర్శకత్వంలో కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలై 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం టీజర్, పాటల ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విడుదలైన టీజర్, పాటలకు ప్రేక్షకులతో పాటు సినీ పరిశ్రమ వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. మానవ సంబంధాలు, తల్లిదండ్రుల విలువ, కుటుంబ బంధాలు, ఫాదర్ సెంటిమెంట్ ప్రధానాంశాలుగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తుందని చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాలో మురళీధర్ గౌడ్, సుధ కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుత సమాజంలో డబ్బు చుట్టూ తిరుగుతున్న మానవ సంబంధాలు, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను హృద్యంగా ఆవిష్కరించిన కుటుంబ కథా చిత్రమిది. ఈటీవీ ప్రభాకర్ మాట్లాడుతూ... "ఈ సినిమా టీజర్, పాటల ఆవిష్కరణ వేడుకలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ముత్యాల సుబ్బయ్య గారి చిత్రాలను గుర్తు చేసే గొప్ప కథ ఇది. చాలా కాలం తర్వాత ఇలాంటి కథ వినడంతో మా అమ్మాయి దివిజను ఈ సినిమా చేయమని ప్రోత్సహించాను. నిర్మాత కోమలి ఎంతో కష్టపడి సినిమా నిర్మించారు. దర్శకుడు సతీష్ ఆవాల తన భుజాలపై బాధ్యత తీసుకుని అద్భుతంగా తెరకెక్కించారు. నాన్న గొప్పతనం, తల్లిదండ్రుల విలువను ఎంతో హృద్యంగా చూపించారు. ఈ సినిమాలోని పాటలు ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలిస్తాయి. డాక్టర్ అవుతుందనుకున్న మా అమ్మాయి ఈ సినిమాతో నటిగా పరిచయమవుతోంది. అందరూ ఆశీర్వదించాలి. ఈ చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

# #NBK112- మంత్రి నారా లోకేష్ క్లాప్, తేజస్విని గౌరవ దర్శకత్వంతో అత్యంత ఘనంగా ప్రారంభం

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంచలన దర్శకుడు కొరటాల శివ కలయికలో రాబోతున్న చిత్రంపై ప్రకటన వచ్చినప్పటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. SLV సినిమాస్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం, అమరావతిలో జరిగిన పూజా కార్యక్రమంతో ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సినీ ప్రముఖులు సురేష్ బాబు, గోపీచంద్ మలినేని, వెంకట సతీష్ కిలారు, సాహు గారపాటి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. కందుల దుర్గేష్ కెమెరాను స్విచ్ ఆన్ చేయగా, నారా లోకేష్ క్లాప్ కొట్టారు. బాలకృష్ణ కుమార్తె నందమూరి తేజస్విని ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రారంభోత్సవానికి సంబంధించిన మొదటి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగమయ్యే అవకాశాన్ని కల్పించినందుకు మా మామగారు బాలకృష్ణ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో, ప్రజల రాజధాని అయిన అమరావతిలో చలనచిత్ర పరిశ్రమను బలంగా ప్రోత్సహించే లక్ష్యంతో మేము పనిచేస్తున్నాము. సినిమాతో పాటు 'క్రియేటర్ ఎకానమీ'ని ప్రోత్సహించడం ముఖ్యమంత్రి గారి ఆశయం. దీనిని సాధించడానికి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యాధునిక ఫినిషింగ్ స్టూడియోలు, లేటెస్ట్ టెక్నాలజీతో కూడిన సౌకర్యాలను అభివృద్ధి చేయడం ద్వారా పరిశ్రమకు ఒక సుస్థిరమైన వ్యవస్థను రూపొందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. నిర్మాతలు, దర్శకులకునేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ఇక్కడ జరగడాన్ని మేము ఒక గౌరవంగా భావిస్తున్నాము. ఇది కేవలం ఒక సినిమాకు సంబంధించిన విషయం మాత్రమే కాదు; అమరావతి ఒక పవిత్రమైన భూమి, భవిష్యత్తులో మరిన్ని సినిమాలు ఇక్కడి నుండే తమ ప్రయాణాన్ని ప్రారంభిస్తాయని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను," అని అన్నారు. డైరెక్టర్ కొరటాల శివ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి విచ్చేసిన గౌరవనీయులైన మంత్రులు నారా లోకేష్ గారు, కందుల దుర్గేష్ గారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. రచయితగా, దర్శకుడిగా మారకముందే, బాలకృష్ణ గారు నటించిన సినిమాలకు సహాయ రచయితగా, సహాయ దర్శకుడిగా పనిచేసే అవకాశం నాకు లభించింది. నేను ఎప్పుడూ ఆయనకు వీరాభిమానిని. బాలకృష్ణ గారి కోసం ఒక సినిమాను రాసి, దర్శకత్వం వహించే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా బాలకృష్ణ గారి అభిమానులకే కాకుండా, సినిమా ప్రేమికులందరికీ ఒక చిరస్మరణీయమైన అనుభూతిని మిగులుస్తుందని నాకు నమ్మకం ఉంది. గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. "కోట్లాది మంది అభిమానుల ప్రేమను, ఆప్యాయతను పొందడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ గారికి, అలాగే ప్రారంభ షాట్‌కు దర్శకత్వం వహించిన తేజస్విని గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. తేజస్విని గతంలో నా 'అన్‌స్టాపబుల్' షోకు సంబంధించి క్రియేటివ్ విభాగంలో పనిచేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇంత భారీ స్థాయిలో ఒక సినిమా ప్రారంభోత్సవం జరిగి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తోంది. దర్శకుడు, నిర్మాతలతో కలిసి నేను పనిచేయడం ఇదే మొదటిసారి కావడం ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా నిలిపింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రోత్సాహం, మద్దతుతో ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము. విజయవాడకు ఈ పరిశ్రమకు ఒక కీలక కేంద్రంగా ఎదిగే సామర్థ్యం ఉంది.

'అఖండ' సినిమా కోసం మేము రాష్ట్రవ్యాప్తంగా అనేక అందమైన ప్రదేశాలలో విస్తృతంగా చిత్రీకరణ జరిపాము. చలనచిత్ర పరిశ్రమ వృద్ధితో పాటు, అమ్యూజ్‌మెంట్ పార్కులు, పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధిని కూడా మేము లక్ష్యంగా పెట్టుకున్నాము. ఇది ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి దిగ్గజాలు జన్మించిన నేల.





## అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్న 'మిర్జాపూర్: ది మూవీ' టీజర్ విడుదల

దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ ఫ్రాంచైజీ "మిర్జాపూర్ : ది మూవీ" టీజర్ విడుదలైంది. ఓటీటీ ప్రపంచంలో సంచలనం సృష్టించిన మిర్జాపూర్ కథ ఇప్పుడు తొలిసారిగా భారీ స్థాయిలో థియేటర్లలోకి రానుంది. 2018లో ప్రారంభమైన మిర్జాపూర్ కథా ప్రయాణాన్ని కొనసాగిస్తూ, ఈ సినిమా కొత్త మరియు ఆసక్తికరమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానుంది. సెప్టెంబర్ 4, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. టీజర్‌లో అలీ ఫజల్, పంకజ్ త్రిపాఠి దివ్యేందు తమ పాత్రలతో మరోసారి కనిపించగా, అభిమానుల అభిమాన పాత్ర బబ్లు పండిట్‌గా జితేంద్ర కుమార్ కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే రవి కిషన్ కొత్త పాత్రలో చేరి కథకు మరింత బలం చేకూర్చారు. ఇక అభిషేక్ బెనర్జీ, రసిక దుగల్, శ్వేత త్రిపాఠి Abhishek తదితర ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అమెజాన్ ఎంజిఎం స్టూడియోస్, ఎక్సెల్ ఎంట
ర్టైన్మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి గుర్మీట్ సింగ్ దర్శకత్వం వహించగా, పునీత్ కృష్ణ కథను అందించారు. రితేష్ సిద్వానీ, ఫర్హాన్ అక్తర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. 'మిర్జాపూర్: ది మూవీ' హిందీతో పాటు తెలుగులో కూడా విడుదల కానుండటం విశేషం.



## ప్రముఖ కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమైన సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్, హీరో ప్రియదర్శి కాంబో మూవీ "ఇడుపు కాయితం"

ప్రముఖ యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా "ఇడుపు కాయితం". ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్ గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా "ఇడుపు కాయితం" సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు లోకేష్ కనకరాజ్ పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, దిల్ రాజు, నవీన్ యెర్నేని, కేఎల్ దామోదరప్రసాద్, ఎస్ కేఎన్, బాపినీడు, ధీరజ్ మొగిలినేని, దర్శకులు మెహర్ రమేష్, చందూ మొండేటి, సాయి రాజేశ్, వేణు ఊడుగుల, సాయి మార్తాండ్ అతిథులుగా పాల్గొన్నారు. అల్లు అరవింద్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు.

# ఓజి -2 సీక్వెల్‌కు పవన్ రెడీ

## సోషల్ మీడియాలో స్పెషల్ వీడియో విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ' బాక్సాఫీస్ దగ్గర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఓజీ 2' రానున్న విషయం ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా, తాజాగా ఆ సినిమా పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం గురువారం ఒక స్పెషల్ వీడియోను సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'గంభీర కథ సిద్ధమవుతోంది. తుపాను రావడానికి ముందు నిశ్శబ్దం ఉంటుంది' అనే పవర్‌ఫుల్ క్యాప్షన్‌తో ఈ అప్‌డేట్ ఇచ్చారు. విడుదలైన వీడియోలో డైరెక్టర్ సుజీత్‌తో కలిసి పవన్ కళ్యాణ్ స్క్రిప్ట్ గురించి చర్చిస్తున్న విజువల్స్ ఉన్నాయి. చివర్లో పవన్ కళ్యాణ్ 'నేను రెడీ' అని చెప్పడం నెటిజన్లను, మెగా అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. దీంతో 'ఓజీ 2' షూటింగ్ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుందని స్పష్టమవుతోంది. మొదటి భాగానికి సంగీత దర్శకుడిగా పని చేసిన థమన్ ఎస్ ఈ సీక్వెల్‌కు కూడా మ్యూజిక్ అందించనున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. 'ఓజీ' మొదటి భాగంలో చూపించిన పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ వరల్డ్‌ను ఈ సీక్వెల్‌లో మరింత పెద్ద స్థాయిలో, కొత్త కోణంలో చూపించనున్నారని టాక్. ప్రస్తుతం రాజకీయాలతో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్, 'ఓజీ 2' కోసం డేట్స్ కేటాయించడంతో అభిమానుల్లో ఫుల్ జోష్ నెలకొంది.




# 'తెల్ల కాగితం' నుంచి ఫస్ట్ సింగిల్ 'చిలకా' అనే మెలోడీ గీతం విడుదల

'కోర్ట్', 'బ్యాండ్ మేళం' అంటూ యంగ్ అండ్ టాలెంట్ నటుడు హర్ష్ రోషన్ వరుస విజయాలతో దూసుకుపోతోన్నారు. హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా 'తెల్ల కాగితం' అనే చిత్రంతో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మలపాటి నిర్మాణంలో రమేష్ బండ్రెడ్డి ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్‌లు, ఇతర కంటెంట్ సినిమా మీద అంచనాల్ని పెంచేసింది. తాజాగా మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'చిలకా' అంటూ సాగే ఈ పాటకు పూర్ణా చారి సాహిత్యం, అనురాగ్ కులకర్ణి గాత్రం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇక విజయ్ బుల్గానిన్ బాణీ అయితే ఎంతో వినసొంపుగా ఉంది. లిరికల్ వీడియోని గమనిస్తే.. స్కూల్ వాతావరణం, హీరో హీరోయిన్ల మధ్య ఉండే ప్రేమ.. వాటిని తెరకెక్కించే తీరు ఎంతో హృద్యంగా కనిపిస్తున్నాయి. హర్ష్ రోషన్, నక్షత్రల మధ్య స్కూల్ డేస్‌లోని స్వచ్ఛమైన ప్రేమకు సంబంధించిన అందమైన క్షణాలు అందంగా బంధించినట్టు కనిపిస్తోంది. 'చిలకా' లిరికల్ వీడియోలో హర్ష్ రోషన్ వేసిన 'హుక్ స్టెప్' సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం ఖాయమన్నట్టుగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి ప్రతిభావంతుడైన రచయిత నందు సవిరిగన కథను అందించారు. 'సమజ వరగమన' మరియు 'నారి నారి నడుమ మురారి' వంటి విజయవంతమైన చిత్రాలకు సహ-రచయితగా పనిచేసి ఆయన మంచి గుర్తింపు పొందారు. కథను రూపొందించడంతో పాటు, నందు స్క్రీన్‌ప్లే మరియు సంభాషణలను కూడా రాశారు; దీనివల్ల ఆసక్తికరమైన సన్నివేశాలు మరియు భావోద్వేగ లోతుతో కూడిన చక్కని కథనం కుదిరింది. ఈ చిత్రం ద్వారా రమేష్ బండ్రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు; ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు ఆయన సరికొత్త దృక్పథాన్ని అందిస్తారని ఆశిస్తున్నారు. 'బేబీ' చిత్రంతో చార్ట్‌బస్టర్ పాటల్ని అందించిన మ్యూజిక్ సెన్సేషన్ విజయ్ బల్గనిన్‌ను ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ కె.వి. గుహన్ కెమెరామెన్‌గా, కార్తీక శ్రీనివాస్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. అద్భుతమైన తారాగణం, నిష్ణాతులైన సృజనాత్మక బృందం కలిసి ఆకట్టుకునే ప్రేమకథతో 'తెల కాగితం' అనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతోన్నారు.





# ఇట్స్ లైఫ్ బ్రో" ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన ప్రామిసింగ్ హీరో నితిన్

కేఎం (కృష్ణమోహన్), పూజా సుందర్ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ఇట్స్ లైఫ్ బ్రో'. కేఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సోమశేఖర్ రెడ్డి దర్శకత్వంలో కృష్ణ మోహన్ సల్లగుండ్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎమోషనల్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రామిసింగ్ హీరో నితిన్ విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ " వైవిధ్యమైన కథ, కథనాలతో ఎమోషనల్ లవ్‌స్టోరీగా రూపొందుతున్న ఈ చిత్రం అందరి హృదయాలకు హత్తుకునే విధంగా ఉంటుంది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ భావోద్వేగ ప్రేమకథ అందరికి తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380